# TAM పత్రిక

APRIL 2018

VOLUME: 4 ISSUE: 2



pic credit: pintrest.com/kekadasgupta

## కథలు

సెకండ్ హ్యాండ్ 14

మహిళా ఎస్సే 19

మరణం 21

## కార్యక్రమాలు

సంక్రాంతి సంబరాలు 7

మహిళా దినోత్సవం 29

మేరీలాండ్ తెలుగు సంఘం పత్రిక

# ADVISORY BOARD



**Dr. Yadla Hema Prasad**



**Dr. Narisetti Innaiah**



**Mr. J Subbarayudu**



**Smt. Rajashree Pakala**



**Mr. Meer Abdullah**

ఎల్లప్పుడూ విలువైన సలహాలు ఇస్తూ, అన్ని రకాలుగా సహాయం అందించే మా సలహా మండలి సభ్యులు శ్రీ యడ్ల హేమ ప్రసాద్ గారికి, శ్రీ నరిసెట్టి ఇన్నయ్య గారికి, శ్రీ జక్కంపూడి సుబ్బారాయుడు గారికి, శ్రీమతి రాజశ్రీ గారికి, శ్రీ మీర్ అబ్దుల్ల గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

# FOUNDERS



**Srinivas Kukatla**
**Founder**




**Srini Samineni**
**Co-Founder**



**Venkat Yarram**
**Co-Founder**



**Suresh Geda**
**Co-Founder**

శ్రీనివాస్ కూకట్ల, శ్రీనివాస్ సామినేని, వెంకట్ యర్రం, సురేష్ గెడ...ఈ నలుగురు TAM కు నాలుగు స్థంబాలై మేరీలాండ్ లోని తెలుగు వారందరినీ ఒక్క తాటి పైకి తెచ్చే కార్య సాధనలో విజయవంతమయ్యారు. వీరి కృషికి ఫలితంగా ఆగస్టు 15, 2015 న TAM ఆవిర్భవించింది. మేరీలాండ్ లోని తెలుగు వారందరికీ సుపరిచితులైన వీరి స్నేహభావమే ఎన్నో కుటుంబాలను TAM సభ్యులుగా చేసింది. పదవులతో సంబంధం లేకుండా మేరీలాండ్ లోని తెలుగు వారి మధ్య సత్సంబంధాలు ఉండే విధంగా వీరు ఎల్లప్పుడూ పాటు పడతారు.

# BOARD OF DIRECTORS



**Raj Yaramala - Chairman**



**Kalyani - Secretary**



**Suma Donga**



**Jagadish Ganapathinedi**



**Anuradha Oruganti**



**Venkat Naraharisetty**



**Rakesh Madhav**



**Srini Samineni**

# EXECUTIVE COMMITTEE



**Suresh Geda**
President



**Subbu Sista -**
Previous President



**Naga Prasad Ganapaneni**
Vice President



**Murali Batchu**
General Secretary



**Venkat Kukatla**
Jt. Secretary



**Nagaraju Krishna**
Treasurer



**Kiran Velivelli**
Jt. Treasurer

# TAM పత్రిక

ఏప్రిల్ 2018

ప్రధాన సంపాదకులు
Editor in Chief
**రాజశేఖర్ చెరుకూరి**

నిర్వాహక సంపాదకులు
**శ్రీనివాసరావు దామా**

The opinions expressed in TAM Patrika belong to the individual authors & do not necessarily reflect those of TAM or The Editorial Board.


**TAM Patrika**
**Telugu Association of Maryland**
**Phone: 410-562-1874**
**tampatrika@tamaryland.org**


## ... విషయ సూచిక ...


| | |
|---|---|
| అధ్యక్షుని సందేశం | 5 |
| సంపాదకీయం | 6 |
| TAM సంక్రాంతి సంబరాలు | 7 |
| సెకండ్ హ్యాండ్ (కథ) | 14 |
| మహిళా ఎస్సై (కథ) | 19 |
| మరణం (కథ) | 21 |
| తైల వర్ణ చిత్రాలు | 25 |
| కోటి పున్నముల వెన్నెల (కవిత) | 28 |
| TAM మహిళా దినోత్సవం | 29 |
| చెప్పగలవారెవ్వరు | 32 |
| వరాహ మిహిరుడు | 36 |
| TAM వంటిల్లు | 40 |
| Crossword | 44 |

# Telugu Association of Maryland
## మేరీలాండ్ తెలుగు సంఘం



## అధ్యక్షుని సందేశం

పచ్చటి పొలాలు... దండిగా పండే వరి... చక్కటి తోటలు.. చేపల చెరువులు... అన్నింటికీ మించి ఆత్మీయుల అంతులేని అభిమానం... ఇదీ కళ్ళు మూసుకుంటే నాకు కనిపించే మా గోదావరి. మరి అలాంటి కోనసీమను, తెలుగింటిని వదిలి అమెరికా లాంటి దూరదేశానికి రావల్సి వస్తుందని పదమూడేళ్ళ క్రితం కల్లో కూడా అనుకోలేదు. కాల మహిమో కంప్యూటర్ చలవో సగటు తెలుగు సాఫ్ట్వేర్ ఇంజినీర్లలా నేను కూడా అమెరికా వచ్చాను. డబ్బుకి ఈ దేశంలో కరువు లేకపోయినా...డబ్బుని మించినవెన్నో కోల్పోయిన భావన మొదట్లో కలిగేది. మనుషులందరూ మీటలు నొక్కే యంత్రాల్లా కనపడేవారు. దీని నుండి బయటపడే మార్గం ఏమిటా అని ఆలోచిస్తే చుట్టూ ఉన్న తోటి తెలుగు వారే సమాధానంగా కనపడ్డారు. తెలుగు నేలని వదిలానే కానీ...తెలుగుదనాన్ని కాదు కదా అని మనసుకి స్ఫురించింది. మందితో మమేకమైతే కోల్పోయినవన్నీ తిరిగి వస్తాయి అనిపించింది. అనుకున్నదే తడవుగా స్నేహితులతో కలిసి చిన్న చిన్న సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం...తెలుగు సంస్థల్లో సభ్యుడిగా చేరి తెలుగు వారితో కలిసి నడవడం చాలా ఆనందాన్నిచ్చాయి.

తెలుగుదనంతో పాటు తెలుగు వారు ఎప్పుడూ కోరుకునేది తెలుగింటి కమ్మటి భోజనం. అమ్మ చేతి వంటను మరిపించలేక పోయినా సాధ్యమైనంత వరకు నేను పని చేసిన సంస్థల్లోని కార్యక్రమాల్లో తెలుగు వారి రుచులైన పూతరేకులు, ఉలవచారు నుండి రాగి సంకటి, కొత్త మామిడికాయ పచ్చడి వరకు అవసరమైతే భారత దేశం నుంచి ఎన్నో ప్రయాసలకోర్చి తెప్పించిన సందర్భాలు కోకొల్లలు. మంచి భోజనం ద్వారా వచ్చే ఆశీర్వాదం మరియు మంచి పనుల చేత కలిగే ఆశీస్సులకు మించిన అదృష్టం కంటే ఇంకేమీ గొప్పవి కావని నా ప్రగాఢ విశ్వాసం.

ఎన్ని సంస్థల్లో పని చేసినా మేరీలాండ్ తెలుగు సంఘం (TAM) లో పనిచేసే అవకాశం కలగడం ఒక మరిచిపోలేని అనుభూతి. దీని స్థాపనలో కూడా నేను భాగస్వామినవ్వడం నా అదృష్టం. కుల మతాలకు, ప్రాంతీయవాదాలకు అతీతంగా, సేవా భావం మెండుగా కలిగిన సభ్యులతో నిండిన TAM సంస్థలో ఎన్నో పదవుల్లో పని చేసి 2017-18 కి గాను అధ్యక్షుడిగా ఎన్నికవడం ఎంతో గర్వంగా ఉంది. అంతే కాదు..ఇది మరింత బాధ్యతను పెంచింది. గొప్ప స్నేహితులను, అభిమానాన్ని, ప్రేమను, గౌరవాన్ని ఇచ్చి, కన్న వారికి, ఊరికీ దూరంగా ఉన్నానన్న భావన తొలగిస్తూ స్వంత కుటుంబాన్ని మరపించే TAM అభివృద్ధికి సహాయపడుతూ, మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి విశేష కృషి చేస్తానని, తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలకు గౌరవాన్ని తీసుకొచ్చే పనులు చేస్తానని...ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను. అలాగే తెలుగు సంఘాలంటే చిన్న చూపు చూసే కొందరి అభిప్రాయాలు మార్చే దిశగా సంస్థని ముందుకు తీసుకెళతానని వాగ్దానం చేస్తున్నాను.



ఇట్లు..మీ..

సురేష్ గెడా

## సంపాదకీయం



# భీమా .. ధీమా

ఈ మధ్య అమెరికాలో తెలుగు వార్తల్లో ముఖ్యంగా వింటున్నవి ప్రమాదాలు, మరణాలు. సోషల్ మీడియా విస్తృతంగా వ్యాపించిన నేటి కాలంలో గోరంతని కొండంతలు చేయడం మామూలే అయినా, ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తే ఒక విషయం మీద దృష్టి సారించాల్సిన అవసరం కనపడుతుంది. అరవై దాటాక హరీ అంటే సరే అనుకోవచ్చు. కానీ నిండా ముప్పై నలభై దాటకుండానే జీవితాన్ని ముగించడం అంటే...ముగించిన వారికి ఎలాగూ ఆ నొప్పి తెలియక పోయినా వారిని నమ్ముకున్న కుటుంబ సభ్యులకు.. ముఖ్యంగా పిల్లలకు భవిష్యత్తు అగమ్యగోచరంగా కనపడుతుంది.

భవిష్యత్తులో అది చెయ్యాలి, ఇది చెయ్యాలి అని ప్రణాళికలు వేసే మనం.. ఆ ప్రణాళికలు నెరవేరే దాకా మనం జీవించి ఉండటానికి మాత్రం ఏ ప్రణాళికా లేకుండా ముందుకు సాగుతూ ఉంటాం. అసాధ్యమైన ఆశయాల కోసం కలలు కనడానికి సిద్ధంగా ఉండే మనం, అనివార్యమైన మరణాన్ని గురించి చర్చించడానికి, ఆలోచించడానికి సంకోచిస్తాం.

ఈ మరణాలు, ప్రమాదాల నేపథ్యంలో ఇప్పుడు "గో-ఫండ్" నినాదాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఎన్నారైలకి, వారి కుటుంబ సభ్యులకీ, వారిని చూడ వచ్చిన తల్లిదండ్రులు, అత్త-మామలు ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒక "గో-ఫండ్" పేజి ఓపెన్ చేసి సహాయం అర్ధిస్తున్నారు. ఇందులో కొన్ని అనుమానాస్పదంగా అనిపించినా చాలా వరకు నిజమైనవే ఉంటాయి. ఇలా నిజంగా అవసరం ఉండి సహాయం కోరే వారిని ఏమీ అనుకోవడానికి లేదు. అమెరికాలో ఆరోగ్య వ్యవస్థ అంత ఖర్చుతో కూడుకున్నదే మరి. కానీ ఇలా ప్రతి ఒక్కరూ ఎంత మందికి సహాయం చేయగలరు? నిజంగా వారి పరిస్థితికి జాలి కలిగినా రోజు రోజుకీ పెరిగిపోతున్న ఈ సమస్యల్లో ప్రతి ఒక్కరికీ సహాయం చేయడం మిగిలిన వారికి కూడా ఆర్ధిక భారమే అవుతుంది.

వర్తమాన సమాజంలో ముఖ్యంగా అమెరికాలో ఆహార అలవాట్లు, శారీరిక వ్యాయామం లేకపోవడం, నిత్యం కార్లలో ప్రయాణం వల్ల ప్రమాదాల తీవ్రత హెచ్చు. చిన్న వయసులోనే మరణాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని  తమ జీవితాన్ని భీమా చేయడం ప్రతి ఒక్కరూ ఆలోచించవలసిన విషయం. ఇండియాలో చాలా మందికీ పాలసీలు ఉన్నా...అవి జీవితాన్ని కాపాడగలిగినంత పెద్ద మొత్తంలో ఉండవు. అమెరికాలో "టర్మ్" మరియు "హోల్ లైఫ్" ఇన్సూరెన్సు పాలసీల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉంది. అప్పుడు మనకి ఏమయినా కూడా మన కుటుంబ సభ్యులు మన పేర ఇలా "గో-ఫండ్" పేజి తెరిచే అవసరం తప్పుతుంది. ఆలోచించండి మరి. భీమా కలిగించగలదు మన కుటుంబానికి ధీమా.

మీ..రాజశేఖర్ చెరుకూరి

ఎడిటర్, TAM పత్రిక

# TAM సంక్రాంతి సంబరాలు

TAM సంక్రాంతి సంబరాలు సెంటెన్నియల్ ఎలిమెంటరీ స్కూల్ లో జనవరి 13న వైభవంగా జరిగాయి. చిన్నారులకు భోగిపళ్ళు, సంక్రాంతి పండుగ అలంకరణలు, సాంస్కృతిక నృత్యాలతో కార్యక్రమాలు ఆద్యంతం ఎంతో ఆనందదాయకంగా జరిగాయి. దాదాపు 500 మంది తెలుగు వారు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు టీవీ యాంకర్ భావన తన హుషారైన నృత్యంతో అందరినీ ఉత్సాహపరిచారు. పిండి వంటలతో కూడిన భోజనం అందరినీ మెప్పించింది. మహిళలకు, చిన్నారులకు, జంటలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. TAM నిర్వాహక సభ్యులు శ్రీనివాస్ పిగిలం మరియు షఫి ఆలపించిన గానాలు అందరినీ సంతోషపరిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా TAM వారు నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. మగువలు అత్యంత ఉత్సాహంగా పాల్గొని అద్భుతంగా ముగ్గులు వేసి చూపరులకు నయనానందం కలిగించారు. ముగ్గుల పోటీల్లో ఈ క్రింద పేర్కొన్న వారు విజయం సాధించారు:

**మొదటి బహుమతి** (2 గోల్డ్ కాయిన్స్) - **విజేతలు**: స్వాతి ఆమిడాల, ప్రణీత - **స్పాన్సర్**: NRI Desi Charms

**రెండవ బహుమతి** (2 సిల్వర్ కాయిన్స్) - **విజేతలు**: ప్రతిమ పువ్వాది, హరిత చింతపల్లి - **స్పాన్సర్**: వెంకట్ గుర్రం, TriStar Realty

**మూడవ బహుమతి** ($25 గిఫ్ట్ కార్డ్) - **విజేతలు**: పద్మలత నీరుమళ్ళ, ఉదయ ముగద - **స్పాన్సర్**: TAM






స్వాగతం!
సుస్వాగతం!!


TAM
TELUGU ASSOCIATION OF MARYLAND
సుస్వాగతం!!


BE RESPECTFUL
BE RESPONSIBLE
BE READY


సంక్రాంతి శుభాకాంక్షలు


సంక్రాంతి








TAM








TAM
స్వాగతం!



# Our Proud Sponsors


Paradise Indian Cuisine

*Where Flavors Come First !*

*Phone us @ (410) 594 9600*

## Paradise Indian Cuisine

1660 Whitehead CT,
Gwynn Oak, MD 21207
Phone: 410.594.9600 | 410.594.0650
EMail: paradisemaryland@gmail.com
www.paradisemaryland.com

8000 Locust Mill St.
Ellicott City, MD 21043
Phone: 410.203.1115
EMail: info@paradiseellicottcity.com
www.paradiseellicottcity.com

issi

CMMI LEVEL 3 | ISO 9001:2008 | ISO 27001 Certified

## International Software Systems Inc.

7337 Hanover Pkwy Suite #A, Greenbelt, MD 20770
**Phone:** 301.982.9700
**Fax:** 301.982.0500
**Toll free:** 1.877.982.ISSI
http://www.issi-software.com

# Our Proud Sponsors


- ✓ Health Information Technology
- ✓ Software Engineering
- ✓ Data Management
- ✓ Cloud Engineering
- ✓ Identity and Access Management

**Chags Health Information Technology, LLC (C-HIT)**

**Address:** 10500 Little Patuxent Pkwy, Suite 400, 430 Columbia, MD 21044

**Phone:** 1 (301) 850-0630 | **Fax:** 1 (844) 248-9994

www.chitinc.com



SUBBARAYUDU JAKKAMPUDI

REALTOR® • BROKER

**SUN PROPERTIES, INC.**

(Licensed in Virginia and Maryland)

Phone: 301-258-9094

Cell: 301-919-2416

Fax: 240-823-1966

subbarayuduj@mris.com

www.jakkampudirealty.com

7425 NEEDWOOD ROAD

ROCKVILLE, MD 20855

REALTOR® MRIS®

# సెకండ్ హ్యాండ్



- రాజశేఖర్ చెరుకూరి

ఏమండీ...మన అమ్మాయికి మా అన్నయ్య గారి అబ్బాయ్ శ్రీకర్ అయితే ఎలా ఉంటుందండి?

భర్త ఏమంటాడో అని అనుమానంగా చూస్తూ అడిగింది సుందరి.

నీకు మతి ఉండే మాట్లాడుతున్నావా? ఒకసారి వాళ్ళ ఇంటికి వెళ్ళి చూడు. సెకండ్ హ్యాండ్ టీవీ..సెకండ్ హ్యాండ్ ఫ్రిడ్జ్... సెకండ్ హ్యాండ్ డొక్కు స్కూటరు.. ఆఖరికి మీ అన్నయ్య వాడే వాచీ కూడా సెకండ్ హ్యాండే. వాళ్ళ దరిద్రం మీద వేసుకొని ఉద్ధరించడం నా వల్ల కాదు. అసలు ఏమి చూసి ఇవ్వాలి నీ మేనల్లుడికి నా కూతురిని?.. అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు ఉమాపతి.

ఇప్పుడు వారికి ఏమీ లేకపోవచ్చండి. కానీ శ్రీకర్ చాలా మంచి అబ్బాయి. ఫారెస్ట్ సర్వీస్‌లో జాబ్ వచ్చింది. భవిష్యత్తులో బాగా ఎదుగుతాడు.. ధైర్యం చేసి మాట్లాడింది సుందరి.

అతను భవిష్యత్తులో కట్టే మేడలకు నా కూతురిని పునాదిని చెయ్యలేను. నా కూతిరిని అల్లారు ముద్దుగా పెంచాను. తను అడిగిందల్లా ఇచ్చాను. తన మిగిలిన జీవితం కూడా అలానే ఉండాలి. నువ్వు అలాంటి వెర్రి ఆలోచనలు పెట్టుకుని దాని బ్రతుకు పాడుచెయ్యకు. విసురుగా అనేసి వెళ్ళిపొయ్యాడు.

ఇది జరిగిన నాలుగు నెలలకు ఒక అమెరికా సంబంధం చూడటం... కూతురికి అంగ రంగ వైభవంగా పెళ్ళి చేసి అమెరికా పంపడం జరిగిపోయింది.

★★★★★★ ★★★★★★ ★★★★★★

ఇదుగో.. ఎక్కడున్నావ్?

భర్త ఉమాపతి కేక వినపడి "ఇక్కడే ..వంట గదిలో ఉన్నా.." అంది సుందరి.

అమ్మాయి వస్తుందంట..అన్నాడు ఉమాపతి.

అవునా.. అని హడావిడిగా ముందు గదిలోకి వచ్చింది సుందరి.

అంతా కులాసాయేనా...పెళ్ళయి అమెరికా వెళ్ళి మూడు నెలలే అయ్యింది. అప్పుడే రావడం ఏమిటి అని ఆశ్చర్యం వ్యక్తం చేసేంతలో.."అమ్మాయికి మన మీద గాలి మళ్ళిందట. అల్లుడు ఉద్యోగంలో బిజీ గా ఉన్నాడట. ఈ మధ్యనే ఏదో బిజినెస్ కూడా పెట్టాడంట. ఒక్కదాన్నే వస్తున్నాను.. వెంటనే టిక్కెట్టు కొని తన ఈమెయిల్ కి పంపమంది" కూతురిని చూడొచ్చన్న ఉత్సాహంలో హుషారుగా చెప్పాడు ఉమాపతి.

"పెళ్ళయ్యాక మనం టికెట్టు పంపడం ఏమిటండీ..." ఏదో అనుమానంతో అనబోయి నోటి దాకా వచ్చిన మాటల్ని పెదాలు దాటనివ్వలేదు సుందరి. ఉన్నది ఒక్కతే కూతురు. ఎవరు కొంటే ఏమిటి అని సమాధానపడింది.

"ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు అని చెప్పింది....ఆఖరికి వాళ్ళ అత్త మామలకు కూడా నట.. " అన్నాడు ఉమాపతి.

అదేంటండీ...వాళ్ళ అత్తా మామలకు చెప్పకుండా ఎలా? అంది సుందరి.

వాళ్ళకి సర్ప్రైజ్ ఇద్దామని లేవే...నీ మట్టి బుర్రకి ఇలాంటివన్నీ అర్థం కావు అన్నట్లు చెప్పాడు ఉమాపతి.

ఈ కాలం పిల్లలు ఇంతే అనుకుని నిట్టూర్చింది సుందరి. కూతురి కోసం ఏమేమి చెయ్యాలా అని ఆలోచిస్తూ మళ్ళీ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

★★★★★★ ★★★★★★ ★★★★★★

ఇంటికి వచ్చిన కూతురు స్నేహ ముఖం చూడగానే ఏదో తేడా కనిపించింది సుందరి కి. పైకి నవ్వుతూ కనిపించినా సూటిగా చూడటానికి ఇబ్బంది పడుతుంది అనిపించింది. ప్రయాణ బడలిక ఏమో అనుకుంది.

ఎంతో ఆనందంగా తుళ్ళుతూ అమెరికా వెళ్ళిన కూతుర్నేనా నేను చూస్తున్నది..అని ఆశ్చర్యపోయింది

కొత్త కాపురం కదా...ఇవన్నీ సహజమేలే .. మెల్లగా అడుగుదాం అని కూతురిని ఏమీ అడగలేదు.

మీ అత్తగారింటికి ఒకసారి ఫోన్ చేసి చెబుదామా అంది కూతురితో.

"అమ్మా...ఒక రెండు రోజులు జెట్ లాగ్ పోయాక చెబుదాం." అంది స్నేహ.
సుందరికి ఇదంతా నచ్చట్లేదు. వాళ్ళు ఏమనుకుంటారో అని మధన పడుతుంది.

స్నేహ భోజనం చేసి పడుకోగానే ... వాళ్ళ అత్త మామల నుండి ఫోన్ వచ్చింది.

ఉమాపతి ఫోన్ ఎత్తి మాట్లాడుతున్నాడు. ఫోన్ స్పీకర్ లో లేకపోయినా అవతల నుండి గట్టిగా స్వరం వినిపిస్తోంది.

"ఏమండీ మీ అమ్మాయి మీ ఇంటికి వచ్చిందా"...అని అడుగుతున్నాడు స్నేహ మామ గారు.

అవునండి...మీ అబ్బాయి చెప్పేశాడా... నవ్వుతూ సమాధానం చెప్పబోయాడు ఉమాపతి.

"అసలు ఆడపిల్లకి ఉండాల్సిన లక్షణాలు కొద్దిగా అయినా ఉన్నాయా మీ అమ్మాయికి.." అని మొదలు పెట్టి ఇంకా ఏవేవో గట్టిగా మాట్లాడటం వినిపిస్తుంది. ఇంతలో ఉమాపతి ఫోన్ పెట్టేసిన శబ్దం వినపడింది.

"ఏమయ్యిందండి..." ఖంగారుగా అడిగింది సుందరి.

తెలియదన్నట్లు చూశాడు ఉమాపతి. అతని మెదడు మొద్దుబారిపోయింది. ఆయన ఏమీ ఆలోచించే పరిస్థితిలో లేడని అర్థం అయ్యింది సుందరికి.

ఇద్దరూ స్నేహ నిద్ర లేచే వరకూ ఆగి "మీ అత్తగారింటి నుండి ఫోన్ వచ్చింది. అసలు ఏమయ్యిందమ్మా" అని మంచం మీద కూర్చుని అడిగారు.

నాన్నా...ఈ విషయం ఫోన్ లో చెప్పడం ఇష్టం లేక ఇక్కడికి వచ్చాక చెబుదాం అని ఆగాను.

ఇక్కడ మిమ్మల్ని చూశాక ఎలా చెప్పాలో ధైర్యం చెయ్యలేక పోయాను.

మీరు అనుకుంటున్నట్లు నేను అక్కడ సంతోషంగా లేను. అవినాష్ కి ఏ విషయం లోనూ తృప్తి లేదు. ప్రతి దానికి ఏదో ఒక వంక పెట్టి ఏడిపించేవాడు. పెళ్ళి చూపుల్లో నేను తనని అడిగింది ఒకే ప్రశ్న. "మీకు సిగరెట్, ఆల్కహాల్ అలవాటు ఉందా" అని. సిగరెట్ ఎప్పుడూ తాగలేదు...ఆల్కహాల్ ఎప్పుడన్నా ఒకసారి ఏదన్నా పార్టీలో తప్పకపోతే కొద్దిగా తీసుకుంటాను అన్నాడు. అతను ఎంతో నిజాయతీగా చెప్పాడని నమ్మాను. అక్కడికి వెళ్ళాక నిజం తెలిసింది. అతను మందు కొట్టని రోజు లేదు. గంటకి ఒక సిగిరెట్ తాగుతాడు. ఒక రోజు లేట్ గా తాగి ఇంటికి వస్తే గట్టిగా అడిగానని నన్ను కొట్టాడు. అది కూడా భరించాను.

వెక్కి వెక్కి ఏడుస్తున్న కూతురిని ఆపబోయాడు ఉమాపతి. తన గుండెల్లో ఉన్న బాధని చెప్పనివ్వండి అన్నట్లు భర్తను ఆపింది సుందరి.

ఇంకా ఏదో వ్యాపారం మొదలు పెట్టాలి...మీ నాన్న ని అడిగి డబ్బులు అడుగు అని రోజూ వేధించే వాడు. నాన్నని అడగటానికి నాకు మొహమాటం లేక పోయినా...ఇలాంటి వాడి కోసం అడగటం నాకు ఇష్టం లేక అడగలేదు.

ప్రతి రోజూ చాలా చులకనగా మాట్లాడే వాడు. నన్ను అన్నా పర్లేదు...కానీ నాన్నని కూడా ఎప్పుడూ తిడుతూ ఉండేవాడు. పెళ్ళిలో విడిది ఇంటి నుండి తనని తీసుకొచ్చిన బెంజి కారు మనదే అనుకున్నాడు అంట. అది మనది కాదు అని చెప్తే... "అద్దె కార్లలో నన్ను తీసుకురావడానికి మీ నాన్న కు సిగ్గు లేదా? మీకు గతి లేకపోతే డాబు ప్రదర్శించడం ఎందుకు? " అని నానా మాటలు అనేవాడు.

ఇవన్నీ భరించలేక మొన్న నాన్నకి ఫోన్ చేశాను. నాన్నను టికెట్ కొనమని చెప్పి.. అవినాష్ ఆఫీసుకి వెళ్ళగానే టాక్సీలో ఎయిర్ పోర్ట్ చేరి వచ్చేశాను...కళ్ళు ధారలు కడుతుండగా చెప్తుంది స్నేహ.

కూతురి మాటలు విని ఇద్దరికీ ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. కూతురు చెప్తున్న మాటలు సుందరిని గతం లోకి తీసుకెళ్ళాయి.

★★★★★★ ★★★★★★ ★★★★★★

అప్పటికి సుందరికి ఉమాపతి తో పెళ్ళి అయి రెండు నెలలు. ఊరు నుండి దూరపు చుట్టం సుబ్బారావు బాబాయ్ టౌనుకి వచ్చి సుందరిని చూసి పోదాం అని ఇంటికి వచ్చాడు.
చిన్న ఇల్లు అయినా చాలా పొందికగా పెట్టుకున్నావ్ అమ్మాయ్. మీ అమ్మ లాగా నీకు కూడా ఓపిక ఎక్కువే.
హాల్లో ఉన్న చెక్క కుర్చీ, బీరువా.. బెడ్రూంలో ఉన్న మంచం చూసి.."చాలా ముచ్చటగా ఉన్నాయి అమ్మాయ్. ఇవి ఎక్కడివి అనుకుంటున్నావ్...ఐదేళ్ళ క్రితం మా చేలో ఉన్న టేకు చెట్లతో చేసినవే .." అన్నాడు.

ఐదేళ్ళ క్రితమా? అన్నాడు ఉమాపతి.
అవునబ్బాయ్...మా ఇంట్లోకని చేయించాం. మళ్ళీ కొన్ని రోజులకి మరింత టేకు వస్తే ఇంకొన్ని మంచాలు అవీ చేయించాం. అందుకని పాతవి అమ్మకానికి పెడితే అదే సమయంలో మీ పెళ్ళి కుదరటం మీ మామయ్య మీకు పనికొస్తాయని కొనడం జరిగిపోయింది. అయినా అమ్మాయ్.. ఏమాట కామాటే చెప్పాలి. మీ నాన్న వీటికి బాగా నగిషీలు చెక్కించి, పాలిష్ పెట్టించి చాలా బాగా తయారు చేశాడు. మీ నాన్నలో ఆ నేర్పు ఉందిలే.. అన్నాడు.

తండ్రిని పొగిడే సరికి మురిసిపోయింది సుందరి.

సుబ్బారావు బాబాయ్ వెళ్ళిపోగానే ఇంట్లోకి వచ్చారు సుందరి దంపతులు.

ఉమాపతి కి చాలా కోపంగా ఉంది. ఒక్క ఉదుటున కాలితో చెక్క కుర్చీని తన్నాడు.

ఏంటండి ఆ కోపం .. ఎమయ్యింది? అంది సుందరి ఏమీ అర్ధం కాక.

అవును నీకు ఏమీ తెలియదు పాపం...అన్నాడు ఉమాపతి.

ఏమయ్యిందో కొంచెం అర్ధం అయ్యేట్లు చెప్పండి..ఇంకా అయోమయంగా మొహం పెట్టింది సుందరి.

మీ బాబాయ్ అంత విడమరిచి చెప్పాక కూడా నీకు అర్ధం కాలేదా? మీ నాన్న నన్ను ఏమన్నా అడుక్కునే వాడు అనుకుంటున్నాడా? వాడేసిన కుర్చీలు, బీరువాలు...ఆఖరికి సిగ్గు లేకుండా కూతురి సంసారానికి వాడేసిన మంచం కొంటాడా? అసలు కన్న తండ్రేనా లేక నిన్ను ఎక్కడి నుంచి అయినా తీసుకొచ్చి పెంచుకున్నాడా? బుసలు కొడుతూ అన్నాడు ఉమాపతి.

సుందరికి ఏమి చెప్పాలో అర్ధం కాలేదు. అవి టేకుతో చేసిన వస్తువులండీ. ఎన్ని సంవత్సరాలైనా చెక్కు చెదరవు. మంచి టేకు దొరికిందని మా నాన్న మన కోసం కొన్నాడు. ఇంకా ఏదో చెప్పబోతున్న సుందరి మాటలు మధ్యలోనే తుంచేశాడు ఉమాపతి.

చాల్లే ఆపు. కట్నం అదీ లేకుండా అందంగా అణకువగా ఉంటే చాలని నిన్ను చేసుకున్నందుకు మంచి పనే జరిగింది. అసలు ఇవి కూడా ఇవ్వమని మీ నాన్నని నేను అడిగానా? మీకు కొత్తవి కొనే సత్తా లేకపోతే నోరు మూసుకోవాలి. అంతే కానీ ఈ సెకండ్ హాండ్ వ్యవహారం అంటే నాకు చాలా చిరాకు... మీరూ మీ సెకండ్ హ్యాండ్ బతుకులు...ఛీ..ఈసడించుకున్నాడు ఉమాపతి.

ఈ మాటలకు హతాశురాలయ్యింది సుందరి. తన తండ్రి తనను అపురూపంగా చూసుకున్నాడు. కాలం కలిసి రాక వ్యవసాయంలో దెబ్బతిన్నాడు. అయినా ఏనాడూ మా అవసరాలకు లోటు చెయ్యలేదు. ఏనాడూ ఒక మాట పడి ఎరుగని నాన్న ఈ రోజు తన భర్త చేతిలో ఇన్ని మాటలు పడాల్సి వస్తుందని మూగగా రోదించింది. తన తర్వాత పెళ్ళి కావల్సిన చెల్లెలు, అన్నయ్య ఉన్నా... కట్నం అవసరం లేని మంచి అల్లుడు దొరికాడని ఎంతో గొప్పగా అందరికీ చెప్పి తన తాహతుకు మించి పెళ్ళి చేశాడు నాన్న. ఈ మాటలు ఆయన చెవిన పడితే తట్టుకోలేడు.

ఇంతలో భుజం మీద కండువా మర్చిపోయిన విషయం గమనించి వెనక్కి వచ్చిన సుబ్బారావు బాబాయి ఇదంతా విని తలుపు దగ్గరి నుండే ఇంటికి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఆయన నాన్నకి ఆ విషయం చెప్పడం... నాన్న ఆ టేకు చెక్కకి చెదలు పట్టి అందరి ఇళ్ళూ నాశనం అవుతున్నాయని నన్ను నమ్మించి ఇంట్లోకి కొత్త ఇనుప బీరువా, కొత్త మంచం తీసుకొచ్చి టేకు సామాను తీసుకెళ్ళడం...ఇవన్నీ వెంట వెంటనే జరిగిపోయాయి. మా ఆయన నేను మా నాన్నకి చెప్పానేమో అనుకుని ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత నాన్న చనిపోయినప్పుడు అన్నయ్య వాళ్ళ ఇంట్లో ఆ టేకు వస్తువులు చూసి అన్నయ్యని అడిగాను. అప్పుడు అన్నయ్య చెప్పగా నాకు ఈ విషయం తెలిసింది. దీంతో నాన్న మీద ప్రేమ ఇంకా పెరిగింది.

★★★★★★ ★★★★★★ ★★★★★★

ఏమండీ స్నేహ కి విడాకులు వచ్చేశాయి కదా.. ఏమి చేద్దాం అనుకుంటున్నారు... అంది సుందరి.

ఏమి చెయ్యలో తెలియడం లేదు సుందరి... దాని భవిష్యత్తు తలుచుకుంటుంటే చాలా భయంగా ఉంది.. అన్నాడు ఉమాపతి.

మీరు ఏమీ అనుకోనంటే...నేను ఒక మాట చెప్పనా...అంది సుందరి తటపటాయిస్తూ.

"చెప్పు" అన్నట్లు మౌనంగా చూశాడు ఉమాపతి.
శ్రీకర్ తో నేను మాట్లాడతానండి. వాడికి కూడా స్నేహ అంటే చాలా అభిమానం. మీరు ఏమంటారు... అంది భర్త వైపు చూస్తూ.
అమ్మాయి ఒప్పుకుంటే .. నాకు అభ్యంతరం లేదు సుందరి" చిన్న స్వరంతో అన్నాడు ఉమాపతి.

★★★★★★ ★★★★★★ ★★★★★★

ఆ రోజు స్నేహ, శ్రీకర్ ల మొదటి రాత్రి. మేడ మీద గదిలో కావల్సిన ఏర్పాట్లు చేసి కిందకి వచ్చింది సుందరి.

అప్పటికే మంచం మీద పడుకుని ఆలోచిస్తున్న ఉమాపతి పక్కన పడుకుంది సుందరి.

"విధి ఎంత చిత్రమైందో చూశారా అండి..." అంది సుందరి.

ఏమీ మాట్లాడకుండా ప్రశ్నార్ధకంగా సుందరి వైపు చూశాడు ఉమాపతి.

మన పెళ్ళి అయిన కొత్తల్లో టేకు మంచం విషయంలో నన్నూ, మా పుట్టింటి వాళ్ళని "సెకండ్ హ్యాండ్" బ్రతుకులు అని ఎంతో అవహేళనగా మాట్లాడేవారు మీరు. ఆ తర్వాత కూడా చాలా రోజులు అనేవారు. ఇప్పటి వరకు "సెకండ్ హ్యాండ్" వస్తువులు మన ఇంట్లోకి రానివ్వలేదు. మీ కూతురికి ఎప్పుడూ కొత్త వస్తువులే కొనిపెట్టారు. కానీ చివరికి మీ కూతురిని మాత్రం "సెకండ్ హ్యాండ్" గానే శ్రీకర్ కి ఇవ్వాల్సి వచ్చింది కదా...అంది కన్నీరు ఉబికి వస్తుండగా..

ఆ మాటలు ఉమాపతికి గుండెల్లో తగిలాయి. తేరుకునేంతలో సుందరి మళ్ళీ చెప్పడం ప్రారంభించింది.

మీ అమ్మ మీద ప్రేమతో ఆవిడ పెళ్ళి చీర భద్రంగా దాచి మరీ మీ కూతురికి పెళ్ళిలో కట్టారు చూశారా.. అది కూడా "సెకండ్ హ్యాండే" కదా...మీ స్థాయిని మించి మీ మొదటి అల్లుడుని బెంజి కారులో తిప్పారు. చివరికి దానికి "అద్దె" కారని మిమ్మల్ని ఎద్దేవా చేశాడు చూశారా... ఏ కూతురికైనా మొదటి హీరో తండ్రేనండి. తన భర్త ఎంత ప్రేమను పంచినా ఆ స్థానాన్ని ఆక్రమించలేడు. అటువంటి నాన్న తప్పు చేసినా అనే అధికారం తనే తీసుకుంటుంది కానీ బయటి వారు ఒక్కమాట అన్నా ఏ కూతురూ తట్టుకోలేదు. అది తండ్రి-కూతురు కలిసి నిర్మించుకునే ఒక ఊహాల కోట. ఆ ఊహాల కోట కంటికి సున్నితంగా కనిపించినా.... ఎవ్వరూ ఛేదించలేనంత దుర్భేద్యమైంది. మీ కూతురు కూడా తనని ఇబ్బంది పెట్టిన దాని కంటే...మిమ్మల్ని అవమాన పరిచినందుకే తన మొదటి భర్త మీద అసహ్యం పెంచుకుంది...ఇన్ని రోజులుగా గుండెల్లో దాచుకున్న బాధని చెప్పుకుని ఏడుస్తుంది సుందరి.

నన్ను క్షమించు సుందరి... నిన్ను ఎంతగా బాధ పెట్టానో నాకు ఇప్పుడు అర్థం అవుతుంది. నాకు చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. అమ్మ చుట్టు పక్కల ఇళ్ళల్లో పాచి పని చేసి వాళ్ళు ఇచ్చే మిగిలిన అన్నం కూరలు తెచ్చి పెట్టేది. స్కూలుకి వెళ్ళినప్పుడు కూడా వాళ్ళ దగ్గరి నుండి తెచ్చిన పాత యూనిఫాం తెచ్చి వేసేది. అలా జాగ్రత్తలు తీసుకుని డబ్బు దాచి నన్ను డిగ్రీ వరకూ చదివించింది. అమ్మ పోయాక కష్టపడి వ్యాపారం చేసి డబ్బు సంపాదించాకే పెళ్ళి చేసుకున్నాను. చదువుకునే రోజుల్లో నేను వాడిన పాత వస్తువుల వల్ల నన్ను "సెకండ్ హ్యాండ్" అని అందరూ ఏడిపించేవారు. అది నా మనసులో బాగా నాటుకు పోయింది. ఆ బాధ వల్ల వచ్చిన కోపంలో నిన్ను ఎన్నో మాటలు అన్నాను. కానీ నువ్వు అన్నీ గుండెల్లో దాచుకుని నన్ను క్షమించావు.

నాకు జీవితం గొప్ప పాఠం నేర్పింది. "కొత్తదనం అనేది శాశ్వతమైన ఆలోచనల్లో, ఆచరణలో ఉండాలి...అశాశ్వతమైన వస్తువుల విషయంలో కాదు" అని. నీ పేరు, రూపమే కాదు.. మనసు కూడా అత్యంత సుందరం...నన్ను క్షమించవూ..అని భార్యని నుదిటిపై ముద్దాడాడు ఉమాపతి.

ఇన్నేళ్ల వివాహ బంధంలో స్వచ్ఛమైన తొలి ప్రేమను ఆ స్పర్శలో అనుభవించింది సుందరి. వెంటనే ముద్దు బాకీ తీర్చేసి క్షమించానని చెప్పకనే చెప్పింది.

# మహిళా ఎస్సై



- బిందు తాడివాక

అప్పటికి నా MCA పూర్తయి సంవత్సరం అయింది. జాబ్ రాలేదు. నాకు Software ఉద్యోగం కంటే కూడా ప్రజాసంబంధమైన సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించగలిగే ఉన్నత ప్రభుత్వోద్యోగాలంటేనే మక్కువ ఎక్కువ. అవినీతిమయమైన ఆ వ్యవస్థ కు నాలాంటి నీతిమంతుల అవసరం ('డబ్బా' కాదు) చాలా చాలా వుంది. పైగా, 'మహిళల పై జరిగే అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలి' అనేది జీవితంలో నాకున్న అతి పెద్ద ఆశయం. ('ఫెమినిస్టు', 'మహిళా మండలి' అనుకుంటున్నారా... కానివ్వండి..) నిరుద్యోగినైన నా ఆలోచనలను, ఆశయాలను ఫలింపచేయగల ఒక గొప్ప అవకాశం ఒక రోజు నాకు పేపర్లో కనిపించింది. ఆనందంతో నా మనసు ఉరకలు వేసింది. 'త్వరలో 200 మహిళా ఎస్సై పోస్టుల భర్తీ'. మామూలుగా ప్రతి సంవత్సరం 30 మహిళా ఎస్సై పోస్టులు భర్తీ చేస్తారు. Competition పెద్దగా ఉండదు. అందునా ఇప్పుడు 200 పోస్టులంటే, అవన్నీ భర్తీ అయితే గొప్పే! అంటే, ఇప్పుడు నేను అప్లై చేసి అర్హత సాధిస్తే చాలు, నాకు ఎస్సై ఉద్యోగం వచ్చేస్తుంది. వెంటనే శరీర బరువు, పొడవు, చూసుకున్నాను. సరిపోయాయి. అర్హత కోసం పరుగు, షార్ట్‌పుట్ , లాంగ్‌జంప్ లాంటివి చెయ్యాలి. నా స్నేహితురాలైన ఒక National Player ను కలుసుకున్నాను. కొద్దిగా practice చేస్తే అవన్నీ తేలిగ్గానే చెయ్యొచ్చని చెప్పింది. ఇక Written Test paper ను మనం ఎలాగూ చించేస్తాం. కాకపోతే Physical Events కోసం శిక్షణ అవసరం కాబట్టి, Notification కోసం ఎదురు చూడకుండా, వెంటనే Coaching లో join అవ్వాలి.. గాలించీ, గాలించీ, best Institute ను కూడా వెతికి పట్టేసుకున్నా! ఇక డబ్బులు కట్టి చేరడమే తరువాయి. అమ్మా నాన్నలను డబ్బు అడగాలి.

నేను అమ్మకు విషయం చెప్పి డబ్బు అడుగుదామని వెళ్లాను, అమ్మేమో ఒక సంబంధం విషయం నాతో మాట్లాడ్డానికి వచ్చింది. నేను ఉద్యోగప్రయత్నాల్లో ఉంటే, వాళ్లు నా పెళ్లి ప్రయత్నాల్లో ఉన్నారు. అమ్మ చెప్పిన సంబంధం విషయం నేను వినలేదు, వినే ఉద్దేశం నాకు లేదు. నా S.I. ఉద్యోగప్రయత్నాల గురించి విని మాత్రం అమ్మ హతాశురాలైంది. ససేమిరా 'వద్దు' అంది. 'ఎందుక'ని అడిగాను. C.I. నిన్ను 'ముండ' అని తిడతాడు అంది. లేబరోళ్లు అయితే తప్ప (క్షమించండి) మనలాంటి గౌరవనీయ కుటుంబాల్లోని స్త్రీలు ఎస్సైలు గా వెళ్లరు, అంది. Police Department లోనే కొద్దిగా D.S.P. లాంటి పెద్ద పోస్టు అయితే ఫరవాలేదు గానీ, S.I. గా మాత్రం కుదరదంది. ఎన్నో విధాలుగా convince చెయ్యడానికి ప్రయత్నించాను. "అమ్మా నీవన్నీ అపోహలు" అని చెప్పాను. కొంత ఆమె చెప్పినదాంట్లోనూ నిజముంది. ఎక్కువగా క్రీడాకారిణులు, దిగువమధ్యతరగతి, బీద కుటుంబాల్లోని యువతులే కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల కోసం పోటీ పడతారు. మధ్యతరగతి కుటుంబాల్లోని నాలాంటి అమ్మాయిలు వీటికి దూరంగా ఉంటారు. ఒకవేళ ఒకరిద్దరు వచ్చినా, వాళ్లకు పెళ్లి కావడం సమస్యగా మారుతుంది. నాకు తెలిసిన S.I. ఒకావిడ పెళ్లి కావటం లేదన్న కారణంగా ఉద్యోగం మానేసింది. అయినా పై విషయాలేవీ నా ఉత్సాహాన్ని తగ్గించలేకపోయాయి. పట్టువదలకుండా అమ్మను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. "ఇంకేమైనా అవ్వు గానీ, నువ్వు ఎస్సై అవ్వడానికి మాత్రం నేను ఒప్పుకోను" అని మొండికేసింది అమ్మ. నిజమే, ఆవిడ నాకంటే ఎక్కువ లోకాన్ని చూసింది, ఎక్కువ మంది పోలీసుల్నీ చూసింది. ఆడైనా, మగైనా, ఎక్కువ మంది పోలీసులు బూతులు తిడుతూ మొరటుగా ప్రవర్తిస్తూ ఉంటారట. నేను పోలీసునైతే నేను కూడా ఆ విధంగా మారిపోతానట. నన్ను అలా మొరటుగా, సంస్కారహీనంగా ఆవిడ ఊహించుకోలేకపోతోంది. నా ప్రయత్నం నేను ఆపలేదు. 'నేను ఎస్సై అవ్వాలి' అన్నాను. 'మంచి సంబంధం, నువ్వు పెళ్లి చేసుకోవాలి' అంది. తిండి తినటం మానేసాను. ఆవిడా మానేసింది. ఏడిచాను. ఆవిడ కూడా కళ్లనీళ్లు పెట్టుకుంది. "ప్లీజ్ మమ్మీ" అన్నాను. "ప్లీజ్ బిందూ" అంది. ఇక తప్పలేదు. వారం రోజుల ఘర్షణ అనంతరం, నేనావిడ దారికి వెళ్లక తప్పలేదు. పెళ్లి చూపులు జరిగాయి. సంబంధం కుదరలేదు (వరకట్న సమస్య). ఇక నేను S.I. అవడం సంగతి మరచిపోయాను. కానీ ఇది జరిగిన రెండు నెలలకు పేపర్లో న్యూస్... 'అబలలైన మహిళా ఎస్సైలను అధిక సంఖ్యలో నియమించడం వల్ల, డిపార్ట్‌మెంటు పనితీరు కుంటుపడుతుందనే అభిప్రాయం పోలీసు వర్గాల్లో వ్యక్తం కావడంతో, 200 మహిళా ఎస్సై పోస్టుల రద్దు'.

# Our Proud Sponsors

UNiFY
Solutions Inc.

- Application Development
- Integrated Services Offerings
- ERP & CRM Practice
- Infrastructure & DBA Services
- Unify AppWorld

**Unify Solutions, Inc.**
4 West Rolling Crossroads, Suite #9
Catonsville, MD 21228
Phone: 410-455-5152 | Fax: 410-455-5153
www.unifysolutions.com

S
SNEHA INDIAN CUISINE

6600 Baltimore National Pike, Catonsville, MD 21228
**Phone:** (443) 251-2187
info@SnehaIndianCuisine.com
http://www.snehaindiancuisine.com

# మరణం



- రవి కొప్పరపు

మీకు తెలియని, కనిపించని యుద్ధం జరిగింది మిమ్మల్నందరినీ రక్షించడానికి !!

తలుపు ముందుకు తోసి ఇద్దరం ఒకరినొకరు ఎదురుగా చూడగానే, వెంటనే ఇద్దరం అచేతనంగా పడిపోయాము. నా ఆఖరి శ్వాసలో ఒకే ఒక సంకేతం పంపాను.....మరణం.

***** ***** *****

దివ్య నా వైపే చూస్తోంది. మొహంలో దిగులు కనిపిస్తోంది, కాని తను పడే బాధ నాకు తెలుస్తోంది. తెలియడం అంటే ఊహించుకోవడం కాదు, ఆ బాధ నాకు నిజంగా (మెదడులో) తెలుస్తోంది. నా ఊహా, లేదా నేను ఇంకా నిద్రపోతున్నానా? దెబ్బ బాగా తగిలినట్టుంది నాకు. మెల్లగా కదిలాను. దివ్య నా చెయ్యి పట్టుకొని అడిగింది, "ఎలా వుందిప్పుడు?" మా అపార్టుమెంటు ఫస్ట్ ఫ్లోర్ నుంచి పడ్డాను. కాని కింద పొదలు వున్నాయి కాబట్టి సరిపోయింది. తలకు పెద్ద దెబ్బ తగల్లేదు కాని దిమ్మగా ఉంది. "ఫరవాలేదు, కొంచెం బెటర్".

ఇంతలో డాక్టరుగారొచ్చారు. "ఎలా వుందిప్పుడు?" మెల్లగా తల ఊపాను ఫర్లేదన్నట్టు. ఆయన దగ్గరకొచ్చి, తల మీదున్న కట్లను పరీక్షించి, పక్కనున్న కంప్యూటర్లో ఏదో చూస్తున్నారు..
"బాగానే పని చేస్తోంది, నొప్పి అంత లేదు" అని మళ్ళీ నేనే అన్నా.
దివ్య నావైపు అర్థం కానట్టు చూసింది....తనేమీ అడగలేదన్నట్టు. డాక్టరు నా వైపు అయోమయంగా చూశారు..నేను వాళ్ళ వైపు చూసి "ఆయన అడగబోతున్నారని నేనే..." మధ్యలో ఆగాను. ఏంటిది? ఆయనేమీ అడగలేదా? మరి డాక్టరు మందు పని చేస్తోందా లేదా అని అడిగినట్టు వినిపించింది...కాని వాళ్ళిద్దరి మొహాలు చూస్తుంటే ఆయన అడిగినట్టు లేదు..నేను ఊహించుకున్నానా?

ఆయన నా వైపు చూస్తూ " మీకు దెబ్బ తగిలి హాస్పిటల్ కు వచ్చినప్పుడు కొన్ని నార్మల్ మెడిసిన్స్ ఇస్తే, తలకు బ్లీడింగ్ తగ్గలేదు. బ్రెయిన్ కి డ్యామేజి ఎక్కువవుతోంది. ఆ పరిస్థితుల్లో ఒకే ఆప్షన్ కనిపించింది. మాది పెద్ద హాస్పిటల్ కాబట్టి, మా దగ్గరికి ఫార్మాస్యూటికల్ కంపెనీ వాళ్ళు ఎక్స్‌పెరిమెంటల్ డ్రగ్స్ తీసుకొస్తారు. అంటే ఇవి ఇంకా గవర్నమెంటు నుంచి పర్మిషన్ రాలేదు జనాల మీద వాడటానికి. అలాగ ఒక పెద్ద మల్టీనేషనల్ ఫార్మా కంపనీ మాకు ఒక డ్రగ్ తీసుకొచ్చింది. దానివల్ల, బ్రెయిన్ లో డ్యామేజి అయ్యిన న్యూరాన్స్ రిపేరు చెయ్యచ్చు. కొద్ది మంది మీద వాడాము, ఒక మంచి రిజల్టే కనిపించింది. మీ వైఫ్ ని పర్మిషన్ అడిగి మీకు ఆ డ్రగ్ ఇచ్చాము. చూస్తుంటే అది పని చేస్తున్నట్టే వుంది"

నేను దివ్య వైపు చూశాను. తను నా చెయ్యి నెమ్మదిగా నొక్కి చిన్న చిరునవ్వు నవ్వింది. ఎంతో ప్రశాంతగా అనిపించింది.
డాక్టర్ లేస్తూ "ఇంకో మూడు రోజులు చూశాక డిశ్చార్జ్ చెయ్యాలో లేదో చూద్దాము. మళ్ళీ కలుస్తా" అని వెళ్ళిపోయారు.
దివ్య నా వైపు చూస్తూ "ఇంక నేను ఆఫీసుకి వెళ్ళాలి, ఇప్పటికే మూడు రోజులు లీవు పెట్టాను. సాయంత్రం కలుస్తా, ఈ లోపు ఏదైనా కావాలంటే ఫోను చెయ్యి.." అని మళ్ళీ ఆగి చిన్నగా నా చెయ్యి మీద కొట్టి "ఊరికినే కాదు, అవసరం ఉంటేనే చెయ్యి. నాకు తెలుసు, కేవలం నా మాట ఫోన్లో వినడానికే చేస్తావని".. నేను నవ్వి సరేనన్నా. తను బ్యాగు లోంచి ఒక పుస్తకం తీసి, "ఇదిగో, టైం పాస్ అవ్వడానికి ఇది చదువుకో, ఎప్పుడూ టీవీ, ఫేసుబుక్ లే కాకుండా" ఇచ్చి వెళ్ళిపోయింది.

తను వెళ్ళిన తరువాత ఒక గంట సేపు ఏదో ఒక అర్థం పర్థం లేని సినిమా ఒకటి టీవీ లో చూసి, విరక్తి కలిగి, నా ఫోన్ తీసి ఫేసుబుక్కు మీద పడ్డాను. అది కూడా చిరాకేసింది. ఎవరి పోస్టు చూసినా తామేదో ప్రపంచం బద్దలయ్యే పనిచేశామన్నట్టు పెట్టే సర్వసాధారణమైన మెసేజీలు. లేదా, తమ ఫోటోలు ఎప్పుడూ మారుస్తూ, లైక్స్  చూసి మురిసిపోయేవాళ్ళు.  సెల్ఫ్ ఇండల్జెన్స్ కి పరాకాష్ట. అసలు ఇంటరెస్టింగ్ కంటెంట్ చాలా తక్కువ. ఇంక లాభం లేదని ఫోన్ పక్కన పడేసి పడుకుందామని కళ్ళు మూసుకున్నా. నిద్దర రాకపోతే, దివ్య ఇచ్చిన పుస్తకం పట్టుకున్నా. కనీసం చదివితే నిద్రొస్తుందేమోనని.

అయిదు నిమిషాల్లో పుస్తకం అయిపోయింది. నిద్ర సంగతి తరువాత, ముందు నాకే ఆశ్చర్యం వేసింది. 350 పేజీల పుస్తకం అయిదు నిమిషాల్లోనా? ఆరోగ్యం బాగున్న వాళ్ళకే రోజులు పడుతుంది చదవడానికి, అలాంటిది హాస్పిటల్ లో తల కి దెబ్బ తగిలి వున్న నేను...?? పక్కన ఏదో మెడికల్ మాన్యుయల్ ఉంటే చూశా.. దాదాపు అన్నే పేజీలు..అది కూడా అయిదు నిమిషాల్లో..

మంచం మీద నుంచి వెంటనే దిగి నిల్చుని జరిగింది అర్థం చేసుకోవడానికి  ప్రయత్నిస్తున్నా. ఏంటిది? ఏం జరుగుతోంది? డాక్టర్ కూర్చున్న కంప్యూటర్ కనబడింది. ఆయన చెప్పిన మాటలు గుర్తొచ్చాయి "...ఫార్మాస్యూటికల్ కంపెనీ వాళ్ళు ఎక్స్‌పెరిమెంటల్ డ్రగ్స్ తీసుకొస్తారు..".

కంప్యూటర్లో ఆ డ్రగ్ పేరు ఏంటో తెలుసుకోవాలి. లాగిన్, పాస్‌వర్డ్ తెలీదు. ఎలా? నా మెదడులో ఏదో తేడా. చాలా చురుకుగా పని చేస్తోంది. కీబోర్డు మీద టైపు చెయ్యడం మొదలెట్టా కొన్ని కాంబినేషన్లు. మూడు సార్లు తప్పు చేస్తే కంప్యూటర్ లాకైపోతుంది. కళ్ళు మూసుకొని, డాక్టర్  టైపు చేస్తున్నప్పుడు కీ లు గుర్తు తెచ్చుకున్నా.....ఓకే! ...ఓపెన్ అయ్యింది. నా పేరు టైపు చేస్తే డ్రగ్ ఇన్‌ఫర్మేషన్ వచ్చింది...దాని పేరు తెలుసుకొని, లాగవుట్ చెయ్యబోతుంటే, ఒక అలోచన వచ్చింది. నాకేనా, ఇంకా ఎవ్వరి కైనా ఇచ్చారా?  సెర్చ్ చేసి చూస్తే, ఇంకో పదకొండు మందికి ఇచ్చారని తెలిసింది. అందరిలోను పని చెయ్యలేదు ఆ డ్రగ్...నాతో సహా ఇంకో ఇద్దరిలో మాత్రమే పని చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి...డాక్టర్ కొంచెం అతిశయోక్తి చేశారన్నమాట, మంచి రిజల్ట్సే వచ్చాయని చెప్పినప్పుడు..ఆ ఇద్దరి పేర్లు, అడ్రెస్ లు గుర్తు పెట్టుకొని లాగవుట్ చేశా..

నా ఫోన్ తీసుకొని ఆ డ్రగ్ పేరు గూగుల్ లో సెర్చ్ చేశా...పెద్దగా ఏమీ తెలీలేదు కాని, ఫార్మా కంపెనీ మీద ఈ డ్రగ్ కు సంబంధించి ఏదో కేసు నడుస్తోంది...ఆ ఫార్మా కంపెనీ చాలా పేరు మోసింది....దొరికిన కేసు వివరాల బట్టి చూస్తే, ఈ డ్రగ్ వల్ల బ్రెయిన్ డ్యామేజి అవుతుందని, పర్మిషన్ ఇవ్వకూడదని కేసు పెట్టారు..కంపెనీ మాత్రం టెస్టు రిజల్ట్సు బాగున్నాయని ఇద్దరి మీద పని చేశాయని చెప్పారు...ఆ మిగతా తొమ్మిది మంది ఊసే లేదు..

నాకర్థం అయ్యింది...నా మీద కూడా 'పని ' చేసింది ఆ డ్రగ్, ఆ ఇద్దరు కాకుండా.  ఈ కంపెనీకి ఆర్మీ, మిలిటరీ నుంచి ఏదో ఒప్పందం వుంటుంది ఈ డ్రగ్ డెవెలప్ చెయ్యడానికి..  ముందు మా మీద ప్రయత్నం చేశారు.  ఎవ్వరికీ తెలీకుండా రిజల్టు తెలుసుకోవచ్చు...దాన్ని బట్టి డ్రగ్ కి మార్పులు చేసి ఆర్మీ కి పంపచ్చు...మాలాంటి వాళ్ళు ఏదో బోనులో వుండే ఎలుకల్లాంటి వారన్నమాట...వాడి పడేయచ్చు..

ఇంక నేను బయలుదేరాలి...మిగతా ఇద్దరు ఎలా వున్నారో తెలుసుకోవాలి. మాకే ఎందుకు ఇలా అవుతుందో అడగాలి. ఇప్పుడు మెదడు క్లియరుగా వుంది..తల మీదున్న కట్లు తీసి డస్ట్ బిన్ లో పడేశా..ఇద్దరి పేర్లు, అడ్రస్సులు తెలుసు కాబట్టి వాళ్ళని వెతకాలి... డ్రెస్ వేసుకొని రూములోంచి తొంగి చూసి, ఎవరూ లేరని ఖాయపర్చుకున్న తరువాత, లిఫ్ట్ తీసుకొని కిందకి వెళ్ళా..ట్యాక్సీ మాట్లాడుకొని మొదటి అడ్రస్ కి తీసుకెళ్ళమని చెప్పా.. దార్లో నా బుర్ర చక చకా అలోచిస్తోంది.    ఈ పాటికి నేను కనపడకపోయే సరికి హాస్పిటల్ వాళ్ళు సెక్యూరిటి అలర్ట్ చేస్తారు. తరువాత ఫార్మా కంపెనీ కి చెప్తారు...వాళ్ళ 'ప్రాపర్టీ ' కదా మరి నేను..ఫార్మా వాళ్ళు వెంటనే తమ 'మనుషుల్ని ' పంపిస్తారు నన్ను వెతకడానికి. అలాగే దివ్య దగ్గరికి కూడా పంపుతారు. దివ్య...తనని ముందు సేఫ్ గా పెట్టాలి..

ట్యాక్సీ వాడికి ముందు దివ్య ఆఫీస్ కి తీసుకెళ్ళమని అడ్రస్ చెప్పా..ఫోన్ తీసి దివ్య తో వెంటనే ఆఫీసు నుండి బయటకి రమ్మన్నా. తను ముందు ఖంగారు పడింది, నేను హాస్పిటల్ లో లేనందుకు. ఆఫీసు దగ్గర దిగగానే, ట్యాక్సీ వాడిని పంపి, దివ్యని తీసుకొని, వేరే ట్యాక్సీ మాట్లాడుకొని మా బ్యాంకు దగ్గరికి వెళ్ళా.. అందులో నేను సాధ్యమైనంత అమౌంటు బయటికి తీసి, నేను కొంచెం మాత్రమే ఉంచుకొని, మిగతాది దివ్యకి ఇచ్చా. దారి పొడుగునా దివ్య అడుగుతూనే వుంది ఏమైందని...బ్యాంకు వెనకాల వెళ్ళి, దివ్య కి జరిగింది చెప్పి, తను ఇంక ఇక్కడ వుండడం సేఫ్ కాదని చెప్పా..తను తక్షణమే ఊరు వదిలి వెళ్ళాలి, తెలిసిన వాళ్ళింట్లో ఉండొద్దు..అది చాలా ఈజీ కనిపెట్టడం...దూరపు ఫ్రెండ్స్ ఎవరైనా ఉంటే అక్కడికి వెళ్ళమన్నా...అప్పుడు కూడా నమ్మకం కలగలా..ఇక్కడ కెమెరాలు ఉన్నాయి, తన ఫోన్ ట్రాక్ చెయ్యచ్చు...తన ఫోన్ తీసి పగలగొట్టి, చెత్తలో పారేశా..డిస్పోసబుల్ ఫోన్ తీసుకొని దివ్య కి ఇచ్చి, ట్రెయిన్ ఎక్కించి పంపాను..తను ఏడుస్తూనే వుంది జరిగేంతసేపు...కన్విన్స్ చెయ్యడానికి కొంచెం టైము పట్టినా, వేరే దారి లేదు...స్టేషన్లో నుంచొని తనని చూస్తూ, పంపలేక పంపా...

దివ్యని పంపిన వెంటనే పని మొదలెట్టా..ముందు మొదటి అడ్రస్ వున్న చోటుకి వెళ్ళి అడిగా. అక్కడున్నాయన చెప్పాడు...చనిపోయినతను వాళ్ళబ్బాయని, ఆ హాస్పిటల్ లో బానే వున్నాడని, ఇంటికి తీసుకొచ్చిన తరువాత కూడా బానే వున్నాడని, కాని కాలేజికి వెళ్తుంటే యాక్సిడెంటు లో పోయాడని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. హాస్పిటల్ నుండి వచ్చిన తరువాత బాగా చురుకుగా అయ్యాడని, చదువులో బాగా రాణిస్తున్నాడని ఆనందించే లోపలే ఇలా అయ్యిందని ఆయన కుంగిపోయారు..

'యాక్సిడెంటు ' అయ్యిందన్న మాట...పనైపోయిందిగా...ఇంక ఎలుకలతో పని లేదు...ఆయన్ని ఓదార్చా..అదేంటో, నా మెదడులో ఆయన్ని ఓదార్చాలని ఫీలింగు కలిగినప్పుడే, ఆయన కుదుటబడ్డట్టు కనపడింది..థ్యాంక్స్ చెప్పి బయటికి వచ్చా...నాకర్థం అయ్యింది...ఇంకొకరి ఫీలింగ్స్ నియత్రించగలను ఇప్పుడు. సరే..ఇంక రెండో అడ్రస్ కి వెళ్ళాలి..

రెండో అతను ఎంత వెతికినా కనపడలేదు. చనిపోయాడన్న ఆధారాలు కూడా లేవు. జస్ట్ మాయమైపోయినట్టు. ఇప్పటికే రెండు రోజులయ్యింది. ఈ రెండు రోజుల్లో నేను ఒక చిన్న రూం రెంటు కి తీసుకొని, కంప్యూటర్లు, సర్వర్లు, పెట్టుకున్నా. ఇతన్ని ఎలాగైనా వెతకాలి.....దానికంటే ముందు డబ్బులు కావాలి..ఇది టైం పట్టేట్టు వుంది...స్టాక్ మార్కెట్టు మీద కన్ను పడింది...మెదడు వేగంగా అలోచిస్తోంది..వెంటనే అనాలిసిస్ చేసి, కొన్ని షేర్లు కొన్నా...నా ప్రిడిక్షన్ తప్పదు..కొన్ని రోజుల్లో చాలా డబ్బు వస్తుంది. దాని కోసం ఓవర్సీస్ లో బ్యాంకు అక్కౌంటు ఓపెన్ చేశా. అంతా సెట్ అయ్యింది.

దివ్య ఎలా వుందో తెలుసుకోవడానికి ఫోన్ చేశా...కనెక్టు అవ్వలేదు..భయం వేసింది. తన డిస్పోసబుల్ ఫోన్ ద్వారా కనుక్కోవడానికి ప్రయత్నించా..కుదరలేదు. ఇంతలో ఆ ఫార్మా కంపెనీ పేపర్ అడ్వర్టైజుమెంటు ఇచ్చింది. అది మామూలు ప్రకటనే, తెలియని వాళ్ళకి. దాన్లో ఉన్న ఒక్క పదం, నాకు తెలియాలనే చేసినట్టు వున్నారు...తమ కంపెనీ 'దివ్య ' మైన ఔషధాలు తయారుచేస్తుందని. కింద ఒక అడ్రస్సు.

ఓకే..వాళ్ళనుండి దివ్య ని విడిపించాలి. వాళ్ళ వీక్ పాయింట్లు తెలుసుకోవాలి. కొంచెం హ్యాకింగ్ చేస్తే, ఆ కంపెనీ సీఈవో ఆఫీసు అకౌంటు దొరికింది. అసలు అంత పెద్ద పొజిషన్లో వుండి తన ఆఫీసు అకౌంటుకి అత్యంత సునాయాసమైన పాస్వార్డు పెట్టుకున్న వాడిని అసలు సీఈవో గా ఎలా చేశారో తెలియదు. ఇంకా ఆసక్తికరమైనదేంటంటే, వాడి అకౌంట్లో కొంత 'అడల్ట్ కంటెంట్ ' దొరికింది. నాకు ఇంకా ఆశ్చర్యం వేసింది. అసలు ఇంత ముందు చూపు లేని వాడు ఇంత పెద్ద పొజిషన్లోకి ఎలా వచ్చాడని. సరే, ఆ అకౌంట్లో వున్న మెటీరియల్ ప్రింటు తీసి, పేపరులో ఇచ్చిన అడ్రెస్ కి పోస్టు చేశా.

తరువాత రోజు పేపరులో వెతికితే, ఎక్కడో చిన్న ప్రకటన. ఒక ప్యాకేజింగ్ కంపెనీ తమ 'ప్యాకేజిని' భద్రంగా పంపేశామని. పంపిన అడ్రెస్స్, ఫోన్ నంబరు ఉంది. నేను మల్టీ హాప్పింగ్ నోడ్సు ఉపయోగించి ఫోన్ చేశా. ఫోన్ ట్రాక్ చెయ్యకుండా వుండేందుకు. దివ్య మాటలు వినగానే గట్టిగా ఊపిరి పీల్చుకున్నా. తను సేఫ్ గానే వున్నానని, ఏం జరుగుతోందో అర్థం కావట్లేదని చెప్పింది. తనని సముదాయించి, ఇప్పుడు ఏమీ కాదని, ఇంటికి వెళ్ళమని, తొందర్లోనే తనని తీసుకెళ్తానని చెప్పి మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పా.

సమస్య లేదు. దివ్య ని ఫాలో చేస్తున్నారు. తనని ఏమీ చెయ్యరు....ఫార్మా వాళ్ళు ఏమీ చెయ్యరు. మరి మిలిటరీ వాళ్ళో? నేను కావాలి వాళ్ళకి. దివ్య కాదు. ముఖ్యంగా నా మెదడు కావాలి. ఇప్పటికే ఇంకోళ్ళని కంట్రోల్ చెయ్యగలిగే పవరు ఉంది నాకు. అది వాళ్ళకి కావాలి. ఇంతకీ ఆ రెండో అతను ఎక్కడ?

కొద్ది రోజుల్లో నా షేర్లు బాగా కూడబెట్టాయి. అవి ఓవర్సీస్ అకౌంటులోకి వేసి, దాని తాలూకు వివరాలు ఒక సేఫ్ బాక్సు లో పెట్టాను. ఆ వివరాలు దివ్య ఫ్రెండుకి పంపాను. నాకేమైనా కనీసం తనకి దక్కుతుంది. ఒక రోజు, హఠాత్తుగా దివ్య మొహం నా కళ్ళ ముందు కనపడింది. నేను చెయ్యలేదు. ఆ మొహం అలానే వుండిపోయి, కొంతసేపట్లో మాయమయ్యింది. నిముషం తరువాత, ఒక రూము తలుపు కనిపించింది...తరువాత ఆ రూము వుండే బిల్డింగు, రోడ్డు..

ఆ రెండో అతని మెసేజి ఇది. తనని కలవమని. నేను తప్పకుండా రావాలని దివ్య మొహం చూపించాడు.. దివ్యని అతను కిడ్నాప్ చెయ్యక్కర్లేదు. నాలాగే ఎక్కడ కూర్చుని వున్నా తనకి హాని చెయ్యగలడు. ఫార్మసి వాళ్ళు పంపి వుండరు ఇతన్ని. వాళ్ళు నా జోలికి ఇంక రారు. నా జోలికి రావల్సిన అవసరం మిలటరి వాళ్ళకే. అంటే ఇతను మిలటరీకి పని చేస్తున్నాడన్న మాట. అందుకే రికార్డుల నుండి మాయమయ్యాడు.

నేను వెళ్ళక తప్పదు. ఇది అంతం చెయ్యాల్సిందే. నేను ఆ బిల్డింగు దగ్గరికి వెళ్ళాను. నన్ను రమ్మన్నాడంటే కేవలం రెండు కారణాలు: ఒకటి నన్ను కూడా మిలటరీ కి సహాయ పడమని ఒప్పించేందుకు, లేదా నన్ను సమాప్తం చేసేందుకు. ఆ రూము దగ్గరికి వెళ్ళి తలుపు ముందుకు తోసి ఇద్దరం ఒకరినొకరు చూశాము.

మా మధ్య మాటలు అవసరం లేదు. ఊహలు చాలు. మొత్తం అంతా ఒక్క సెకను లో అయిపోయింది.

అతను అడిగిన దానికి నేను ఒప్పుకోలేదు. మేమిద్దరం కలిస్తే ఎంత పవరు వుంటుందో నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవచ్చన్నాడు. నేను మన బతుకులు మనం బతుకుదాము, వీలైనప్పుడు ఇంకోళ్ళకి సహాయం చేద్దామన్నా. నాది చిన్న ప్రపంచం అన్నాడు. అయితే ఈ చిన్న ప్రపంచంలో నువ్వో, నేనో వుండాలి అన్నా. నా మెదడు లోకి వెంటనే ఏదో గుచ్చుకున్నట్లు నొప్పి. అతనికి నాకంటే పవరు ఎక్కువన్నమాట. నేను తిరిగి బిల్డింగు కూలిపోయేట్టు వున్న దృశ్యం పంపా. కొంచెం చలించాడు కాని వెంటనే తేరుకున్నాడు. నేను తేరుకొనే లోపల ఇంకో దెబ్బ. నా శరీరంలో అవయవాలు కదలనట్టు. ఊపిరి బిగపట్టుకుపోతోంది. అతను నా మెదడులో వున్నాడు ఇప్పుడు. ఆక్రమించుకుంటున్నాడు. నన్ను మారుస్తాడట. నాకు తెలిసేసరికి అతను ఏం చెప్తే అది చేస్తానట. ఇంతలో నాకు చిన్న దారి కనబడింది. నన్ను ఆక్రమించే ధ్యాసలో అతని మెదడు తెరుచుకుంది. నేనేం చెయ్యాలో అర్థం అయ్యింది. నేను తప్పించుకోలేను. కనీసం ఇద్దరం తప్పించుకోకుండా చేస్తా.

ఒక్క సారి దివ్య మొహం, తన స్పర్శ, మాట, తనతో అనుభూతులు అన్నీ గుర్తు తెచ్చుకొన్నా. తనకి సందేశం పంపా...ఇంక శెలవని. నా ఆఖరి శ్వాసలో ఒకే ఒక సంకేతం పంపా అతనికి, నాకు.....మరణం.

# తైలవర్ణ చిత్రాలు





ఈ చిత్రాలను చూడగానే జీవం ఉట్టిపడుతున్నాయి కదూ..ఇవి ఇంటర్నెట్ లో నుండి డౌన్‌లోడ్ చేసినవి కాదు సుమా...ఇవి స్వయానా మన TAM సభ్యురాలు వైద్య వరద గారు తన స్వహస్తాలతో గీచిన (జీవం పోసిన) చిత్రాలు. వీరు రవి కొప్పరపు గారి సతీమణి. ఇంకెందుకు ఆలశ్యం...ఈ కళాకారిణి ప్రతిభకు జేజేలు చెబుదామా...? ముందు ముందు మరెన్నో మంచి చిత్రరాజాలు గీయాలని TAM మనస్ఫూర్తిగా కోరుకుంటుంది.



# SAT ACT PREP
## Score Guarantee Program

Y2 Academy · Action Achievement Advancement · 1995

New SAT — At least 270pt. Increase or Minimum 1500pt. (1600 Perfect)

ACT — At least 6pt. Increase or Minimum 33pt. (36 Perfect)

### Y2 Academy Ellicott City Perfect Scores
- Mae Abdullah (Atholton High) — Perfect Score in SAT English 800
- Mayur Krishna (Centennial High) — Perfect Score in SAT Math 800
- Michelle Munn (Long Reach High) — Perfect Score in ACT English 36

### 2017 Fall Semester
SAT Course : October 21, 2017 - March 8, 2017
ACT Course : October 21, 2017 - April 13, 2018

### 2017 Winter Semester
SAT Course : December 23, 2017 - March 8, 2017
ACT Course : December23, 2017 - April 13, 2018

### Y2 Academy Students 1500 (and above) in SAT
Mae Abdullah (Atholton High)
Mayur Krishna (Centennial High)
Chae Rin (Atholton High)
Chaitanya Murali (Centennial High)

### Y2 Students 1450 (and above) in SAT
Kiran Yarlagadda (Centennial High)
Soomin Cho (Atholton High)
Balaji Kodali (Centennial High)
Justin (Marriotts Ridge)

8659 Baltimore National Pike, Ellicott City, MD 21043 ellicottcity@y2academy.com | 443.574.5249 | www.y2academy.com



Primatech Solutions Inc
Success Comes with Connectivity

**Primatech Solutions Inc.**
6152 Golden Bell Way, Columbia MD 21045
Phone: (516) 850 8949
www.primatechna.com
Contact: anitha@primatechna.com



CVATax
Comilang & Varghese Associate
301-910-6876

**CVATax**
Comilang & Varghese Associates
Tax Preparation
*Federal & State Returns*
www.cvatax.com



CURIE LEARNING
learning with the leader ...
www.curielearning.com

- Pre-K , Kindergarten and Grade-1 Enrichment Program
- Grades 2-12 Enrichment Program
- Grades 2-12 Advanced Program
- PSAT / SAT / ACT / CO-GAT Courses
- English Writing Program

3240 Corporate Ct C,
**Ellicott City**, MD 21042
Phone : (443) 325-5298

13202 Executive Park Terrace,
**Germantown**, MD 20874
Phone : (443) 325-5298



yuva DANCE ACADEMY

- Bollywood Fusion
- Kathak Classical
- Bollywood Zumba
- Garba

**YUVA Dance Academy**
3240 Corporate Ct Suite E, Ellicott City, MD 21042
Phone: 410 236 4567 | 571 499 8645
http://www.yuvadanceacademy.com


# కోటి పున్నముల వెన్నెల

- సుపాణి



కోటిపున్నముల వెన్నెల కోరుకుందమా
వేయివసంతాల వెలుగు వేడుకుందమా
భరతజాతి బహుళ కీర్తి పాడుకొందమా
మానవతకు జయపతాక ఎగురవేతమా.

ఈ గంగా గోదావరులు బహుపవిత్ర తీర్ధ నదులు
ఆ కాశీ , ఈ కంచీ -దివ్యమైన ధామమ్ములు
కాళిదాసు భవభూతులు టాగూరూ పోతన్నలు
సాహితి సామ్రాజ్యములో కవిపుంగవరాజమ్ములు



త్యాగయ్యా రామదాసు అన్నమయ్య తులసి స్వామి
సంగీతపు భావనలో సంకీర్తన స్వరఝరులు
తాజమహలు బృందావనులు సందర్శక క్షేత్రమ్ములు
అజంతా ఎల్లోరాలు చిత్రకళా స్రవంతులు

కూచిపూడి కథాకళీ నృత్యభారతికి సిరులు
పాడీ పంటల పల్లెలు చెమటోడ్చే శ్రమకీర్తులు
హిమాలయమూ కాశ్మీరూ
భరతమాతకు మకుటమ్ములు
సత్యాహింసల వర్తన
మన జాతికి జవసత్వమ్ములు

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2018

"భరించు వాడు భర్త" అని మనకి ఒక నానుడి. కానీ భూమిని మోసేది స్త్రీ. సంసారాన్ని నడిపేది స్త్రీ. కడుపు నింపేది స్త్రీ. ఆఖరికి నేను మగాడిని అని రొమ్ములు విరుచుకునే మగాడి మగతనానికి ఒక అర్థం ఇచ్చేది స్త్రీ. ఒక తల్లిగా, ఒక తోబుట్టువుగా, ఒక స్నేహితురాలిగా, ఒక భార్యగా, ఒక కూతురిగా వివిధ రూపాల్లో మనకు తోడుగా ఉండే ఆడది లేనిదే ఏ మగాడికీ రోజు ముందుకు వెళ్ళదు. స్త్రీ పురుషులు సమానమా కాదా అనేది నేటి తరానికి ఒక ప్రశ్న కాదు. ఒకరు బలవంతులయ్యి ఉంటే ఏనాడో రెండవ వారు అంతరించే వారు. ఎవరు అంతరించినా మరొకరికి మనుగడ లేదు. అందుకే స్త్రీ పురుషులు ఎప్పుడూ సమానమే..స్త్రీలు కొంచెం ఎక్కువ సమానం... ఎందుకంటే..

మగాడు అనాదిగా ఇంటికి కావలసినవి సమకూరిస్తే..ఆడది ఇంటిని చక్కబెడుతూ బిడ్డలను ప్రేమతో సాకేది. ఇది ఒకప్పటి కాలం. కాలం మారుతోంది. మరి మారుతున్న కాలానికి అణుగుణంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్ని కాలాలు మారినా మార్పు చెందనిది తల్లి ప్రేమ. అది ఎన్నటికి మార్పు చెందనిది. ఒక మగాడికి "తల్లి" ప్రేమను పంచితే, "భార్య" రూపంలో మళ్ళీ ఆ మగాడి బిడ్డలకు మాతృత్వపు మమకారాన్ని అందిస్తుంది. అటువంటి భార్య పట్ల మృదుత్వం, ప్రేమ, గౌరవం మగాడికి ఒక "తోబుట్టువు" ద్వారా అలవడుతుంది. స్త్రీ పురుషుల బాధ్యతలు వేరయినా...హక్కులు మాత్రం సమానమే అన్న నిజాన్ని ప్రతి మగాడూ తెలుసుకోవాలి.

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా TAM నిర్వహించిన వేడుకల్లో భాగంగా మార్చి 3, 2018 న మేరీలాండ్‌లోని తెలుగు మహిళలెందరో ఒక చోట కలిసి కొన్ని గంటల పాటు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పారడైస్ ఇండియన్ కుజీన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డా. కాంచన గారు, రియాల్టర్ కిరొన్ గారు, మరియు వన్నెంరెడ్డి కళ్యాణి గారు పాల్గొన్నారు. ఆటలు, పాటలతో ఎంతో ఆనందంగా ఈ కార్యక్రమం జరిగింది. కొన్ని గంటల పాటు నారీమణులు ఇంటి బాధ్యతలకు దూరంగా ఉల్లాసంగా గడిపారు. ఇటీవల మరణించిన ప్రముఖ నటీమణి శ్రీదేవిని ఈ సందర్భంగా తలచుకుని మౌనం పాటించి, ఆవిడ ఏ విధంగా వివిధ పాత్రల్లో భారతీయ ప్రేక్షకులను అలరించారో గుర్తు చేసుకున్నారు.










TAM
Telugu Association of Maryland

# చెప్పగలవారెవ్వరు ?

- చంద్రవదన

ఆడవాళ్ళు, మగవాళ్ళు శారీరకంగా విభిన్నమైన విధులు నిర్వర్తించడానికి పరిణామం చెందిన జీవాలు. ఈ తేడాల నాధారంగా చేసుకుని మాత్రమే ఆడ, మగ అను లింగ వర్గీకరణ జరుగుతుంది. స్త్రీత్వం, పురుషత్వం అనేవి సామాజికంగా నిర్మించబడిన నిబంధనలు. ఆడవాళ్ళచే ప్రదర్శించబడే దయ, కరుణ, సుకుమారము, ప్రేమ అనబడే విలక్షణములను స్త్రీత్వం అని, మగవారికి ఉండే ధైర్యము, సత్తువ, స్వాతంత్ర్యం, చురుకుతనము, ముఖ్యంగా నాయకత్వ లక్షణములను పురుషత్వమని విభజించబడ్డాయి. ఇవి సమాజం వారి నుండి ఆశించిన లక్షణాల, లేదా లింగ అనివార్యమైన లక్షణాలా అనేది మాత్రం సందేహాస్పదమైనది.

కానీ కాల క్రమేణా సామాజికంగా వచ్చిన మార్పుల వలన ఈ లింగ ఆధారమైన విలక్షణాలు ఇరు వర్గం వారికి వర్తించడం చూస్తున్నాము. అంటే ఒక స్త్రీ మగవాని వలే ధైర్యంగా, చురుకుగా, నాయకురాలు కాగలదు; అదే విధంగా ఒక పురుషుడు అమితమైన దయార్ద్రహృదయుడై, సౌమ్యంగా, ఓర్పుతో సాధువులాగా కుడా బ్రతకగలడు. ఇలా ఉండడం కుడా ప్రకృతి సహజమే.

ఐతే, ఇరువర్గం వారు చదువులో, తెలివిలో, ఉద్యోగాలలో సరి సమానులైనప్పుడు, మగవారు మాత్రమే ఇంటి పెద్దగా చలామణి అవుతున్నారెందుకు? ఇక్కడ భార్య, భర్తల మధ్య విభేదాలు సృష్టించడానికో, లేదా మాగవారి, ఆడవాళ్ళ మధ్య వివాదం రేపడానికో వేసిన ప్రశ్న కాదు. మన చుట్టూ జరిగే వింతలు విడ్డూరాల గురించి మట్లాడుకోవడం మనందరకీ అలవాటే. చాలా మందికి రివాజుగా తోచిన విడ్డూరం ఏమిటంటే, భార్య ఎంత చదువుకున్నప్పటికీ, తెలివైనదైనప్పటికీ, పనిమంతురాలైనప్పటికీ, ఇంటి పెద్ద ఎవరు అంటే భర్త పేరు మాత్రమే వినిపిస్తుంది. అంటే భర్త వయసులో పెద్దవాడు కాబట్టా? ఈకాలంలో తోటివయస్కులును కూడా పెళ్ళిచేసుకుంటున్నారు. ఇప్పుడూ అంతే. ఇంటి పెద్ద అంటే 'వారే!!'

' వారు' ఇంటి పెద్దగా ఉండటంలో తప్పేమీ లేదు, ఎప్పుడు ? వారు తెలివిగా, సమర్ధవంతంగా, తన సంగతులను, తన కుటుంబసభ్యుల వ్యవహారాలను చక్కదిద్దుకోగలిగినప్పుడు. కానీ చూస్తే ఆ 'వారికీ' అంత తెలివి లేదు. భార్య మహా తెలివైనది, కార్య సాధకురాలు. కాని, ఆ వారు ఎప్పుడూ ఆమె మాట వినరు, ఆమెను సలహాలు ఇవ్వనివ్వరు. ఒకవేళ ఇచ్చినా, నాకు చెప్పేటంతటి దానివా అని కొట్టిపారేస్తారు.

పెళ్ళి కాలం యొక్క పరీక్షలని ఎదుర్కొని నిలబడిన వ్యవస్థ. ఈ వ్యవస్థలోని ఇరువర్గం వాళ్ళు తమవొంతు కృషి చేయకపోతే ఇదంత సునాయాసంగా జరిగిన , జరుగుతున్న విషయం కాదు. నేను స్త్రీవాదకురాలు కానప్పటికీ, పెళ్ళి అనే వ్యవస్త ని కాపాడే విషయానికి వస్తే మాత్రం పురుషుల కన్నా స్త్రీల సహకారమే ఎక్కువగా కనిపిస్తుంది.

ఇదివరకటి రోజుల్లో ఆడపిల్లలకి పెళ్ళి కాగానే, "నీ భర్తను ఎదిరించకుండా చెప్పిన మాట వింటూ ఒదిగి ఉండు..." అని చెప్పి పంపించేవారు. దీనికి పలు కారణాలు ఉండుండొచ్చు - భర్త వయసులో పెద్దవాడో, లేకపోతే కొద్దో గొప్పో అడపిల్ల మీద నాలుగాకులు ఎక్కువే చదివినవాడో అయ్యుండవచ్చు కాబట్టి, కుటుంబం మరియు చుట్టూ ఉన్న ప్రాపంచిక విషయాల మీద ఎక్కువ జ్ఞానం కలిగి ఉంటాడు అనే నమ్మకంతో ఇలా చేసి ఉండేవారు. అదే విధంగా మగవాడికి కుడా "భార్య కొంగు పట్టుకుని తిరగకుండా, నీ చెప్పు చేతల్లో ఉంచుకోవడం నేర్చుకో..." అని ఉచిత సలహాలు ఇస్తుండేవారు.

నేటితరానికి వచ్చే సరికి, 'నీ భర్త చెప్పినదానికల్లా తలాడించకుండా తెలివిగా ఉండటం నేర్చుకో. ఏ గొడవలొచ్చినా కోర్టులో తేల్చుకుందాం. మనమేమన్నా తక్కువ తిన్నామా? మన పిల్లా సంపాదిస్తుంది నెలకి లక్ష రూపాయిలు', అని డాబులు పలికే పిల్ల తరఫు వాళ్ళు; 'లోకమేమీ గొడ్డుపోలేదు, మన మాట వింటే సరి, లేకపోతే విడాకులు ఇచ్చేసి ఇంకోపెళ్ళి చేసుకుంటే పోలేదా,' అని తొందరపడే పిల్లాడి వైపు వాళ్ళు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఆడవాళ్ళు మగవాళ్ళతో సమానంగా డిగ్రీలు తెచ్చుకోవడం, ఉద్యోగాలు చేసి సంపాదించడం స్త్రీల పురోగతికి నిదర్శనంగా ఒక పక్క అనిపించినా, అటు ఆడవాళ్ళు గానీ, ఇటు మగవాళ్ళు గానీ కేవలం తమకున్న ఆర్థిక, అంగ బలం యొక్క మద్దతు తో కాకుండా యుక్తి తో నిర్ణయాలు తీసుకోవడం ఎంతో సమంజసంగా తోస్తుంది.

ఉదాహరణకి మనము అటు స్త్రీవాదుల వైపు, ఇటు స్త్రీవైరుల వైపు కాకుండా మధ్యలో నిలబడి మనల్ని మనము ప్రశ్నించుకుంటూ సమాజాన్ని ప్రశ్నిద్దాం -

అహంభావానికి, ఆత్మ గౌరవానికి మధ్య వ్యత్యాసం తెలుసుకోవలసిన అవసరం లేదా?

భార్యా విధేయుడిని చూసి వెక్కిరింత కేవలం భార్య కు విధేయుడనా లేక అసమర్ధురాలైన భార్యకు విధేయుడనా?

భార్య నోటి నుండి వచ్చిన భేష్షైన సలహా అహం అడ్డొచ్చి నాసిగా అనిపిస్తే నష్టపోయేది ఎవరు?

ఆకారణంగా ప్రశ్నించడం, వాదనకు దిగడం, వ్యతిరేకించడం స్త్రీ అభ్యున్నతికి తార్కాణం అనుకుంటే ఎలా?

వేషధారణలో మార్పులు చేసుకుని ఆలోచనకి, వ్యక్తీకరణకి నోచుకోని బుర్రతో తిరుగుతూ నేను స్వేచ్ఛాజీవినని, నేటి మహిళనని మురిసిపోతే సరిపోతుందా?

మంద బుద్ధి గల ఇంటిపెద్ద అడుగుజాడల్లో నడవటం ఆ కుటుంబానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది?

ఎవరైతే కుటుంబ క్షేమం కోసం సరైన నిర్ణయాలు తీసుకుంటారో వారినే ఇంటి పెద్దగా గౌరవిద్దాము. వారు భార్య కావచ్చు, భర్త కావచ్చు. తెలివిగల భార్య కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపించాలి. భార్య తెలివైనదని తెలిసి, ఆమె తీసుకున్న నిర్ణయానికి కట్టుబడిన భర్త తెలివైనవాడే అవుతాడు తప్ప, భార్య కొంగుచాటు భర్త అని సమాజ హేళనకి బాధితుడు కారాదు. సరైన నిర్ణయం ఎటువైపునుండి వచ్చినా దానిని స్వీకరించి ఆచరణలో పెట్టినప్పుడు ఇంటి పెద్ద హోదా కి అర్హులవుతారు. సమర్ధులైన కోడళ్ళను, అల్లుళ్ళను ఎప్పుడైతే వారి వారి అత్త-మామలు ప్రోత్సహిస్తారో, చక్కని కుటుంబాలు తయారవుతాయి. భార్యా భర్తలకు ఒకరిమీద ఒకరికున్న ప్రేమాభిమానాలు, ఒకరితో ఒకరు ప్రవర్తించే తీరు పిల్లల మీద ప్రభావం చూపించి, వారు తమ జీవితాలని తగిన విధంగా నిర్దేశించుకోవడానికి వెలలేని పాఠాలు అవుతాయి.

# Our Proud Sponsors


Greater Montessori School

8866 Columbia 100 Pkwy, Columbia, MD 21045
**Phone:** (443) 741-2337
**Email:** info@greatermontessori.com
http://greatermontessori.com/

**K C Accounting & Tax Services**
Madhavilatha Chintalapati, CPA
9372 Paragon Way, Owings Mills MD 21117
Ph. (410) 988-7408 | Fax. (410) 558-6393
KC ACCOUNTING & TAX SERVICES
ITIN - Certified Acceptance Agent
Authorized IRS e-file Provider

RELIS LLC INFORMATION MANAGEMENT

- IT Staffing
- Software Development
- Application Maintenance
- QA Testing
- Software Re-Engineering
- IT Training

**RELIS LLC Information Management**
301 Maple Ave West, Suite 220, Vienna, VA 22180
Phone: 703-635-7779 | Fax: 240-482-8345
Email: contact@relis-llc.com

# Our Proud Sponsors


KIDDIE ACADEMY®

EDUCATIONAL CHILD CARE

**Mamatha Dasari**

9845 Greenbelt Rd, Lanham, MD 20706

Phone: 240-241-4925 | Cell: 443-765-8382

http://KiddieAcademy.com/lanham

AGISOL LLC

AGILE SOLUTIONS

8115 Maple Lawn Blvd Suite 350

Fulton, MD 20759

Phone: 301-775-2780

**Email**: Satyachalasani@agisol-llc.com




# ప్రముఖ భారత శాస్త్రవేత్తలు - వరాహ మిహిరుడు




- వెంకట్ నల్లమోతు

"ఇది సంభవమేనా అచార్యా?"
విక్రమాదిత్యుడి గొంతులో రాచరికపు ఆధిపత్యానికి బదులు ఒక తండ్రి ఆవేదన ప్రస్ఫుటంగా వినపడింది.

"అవును మహారాజా! వినడానికి కటువుగా ఉన్నా యువరాజు వారి పద్దెనిమిదవయేడు మీకు పుత్రశోకం కలుగునని గ్రహాలు నిర్దేశిస్తున్నాయి."
మిహిరుడి మనస్సు శోకిస్తున్నా అతనిలోని శాస్త్రవేత్త ఏమాత్రం సందేహించలేదు.

ఆస్థానం అంతా ఒక్క నిమిషం నిశ్శబ్దం ఆవహించింది. తరువాత ఒక్కసారిగా కల్లోలం మొదలైంది. సభలో సమావేశం అయినవారందరూ మిహిరుడి సూచన గురించి చర్చించడం మొదలుపెట్టారు.



"లేదు! లేదు!" ఊరడించడానికి శక్యంకాని దుఖంతో మహారాణి విక్రమాదిత్యుడిని ఈ విధంగా అభ్యర్థించింది, "ఇది అసంభవం మహారాజా! ఈ భవిష్య సూచన నిజం కాకూడదు. అలా జరగకుండా మీరు చూడాలి. ఎలాగైనా యువరాజుని కాపాడుకోవాలి!" అని విలపించింది.

మహారాజుకి మిహిరుడి మీద అపారమైన నమ్మకం ఉంది. అయినా యువరాజుని కాపాడటానికి తన శక్తి కొలది ముందు జాగ్రత్తలు అమలు పరిచాడు. కాని మిహిరుడి భవిష్యవాణి నిజమైంది; తను సూచించిన ఘడియలో యువరాజుని ఒక అడవి పంది (వరాహం) చంపింది.

వార్త విన్న విక్రమాదిత్యుడు మిహిరుడిని ఆస్థానానికి పిలిపించాడు. "నేను ఓడిపోయాను. నీవు గెలిచావు"!

మిహిరుడు దుఃఖంతో తలదించుకున్నాడు. "గెలిచింది నేను కాదు మహారాజా! ఈ గెలుపు ఖగోళ శాస్త్రం మరియు జ్యోతిష శాస్త్రాలది!"

దానికి బదులుగా విక్రమాదిత్యుడు, "కావొచ్చు! కాని శాస్త్రాలలో సత్యం కలిగి ఉంది అని మీరు నిరూపించారు. ఖగోళ మరియు జ్యోతిష శాస్త్రాలలో మీ నైపుణ్యానికి గుర్తింపుగా ఈ రోజు నుండి మీకు '**వరాహ**' అనే బిరుదుని అందిస్తున్నాను". ఆ రోజు నుండి మిహిరుడు "వరాహమిహిరుడి"గా ఖ్యాతి చెందాడు.

వరాహమిహిరుడి పుట్టుక మరియు బాల్యం గురించిన వివరాలు అరుదు. అతడు క్రీ.శ. 505 నాడు ఉజ్జయని నగరం సమీపమునందు కపిథ అను గ్రామంలో జన్మించాడు. మిహిరుడి తండ్రి ఆదిత్యదాసుడు సూర్య భగవానుడిని కొలిచేవాడట. జ్యోతిష శాస్త్ర జ్ఞానం మిహురుడికి బాల్యంలో తన తండ్రి వద్దనుండి అందింది. ఒకమారు కుసుమపురం (పాట్నా) నగరాన్ని పర్యటిస్తుండగా మిహిరుడికి ప్రముఖ ఖగోళ మరియు గణితశాస్త్రవేత్త ఆర్యభట్టుడితో పరిచయమయ్యింది. ఆ సమావేశం ప్రేరణతో మిహిరుడికి ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెరిగింది. ఖగోళ మరియు జ్యోతిష శాస్త్రాల అధ్యయనం అతడి జీవిత లక్ష్యాలుగా మారాయి. అప్పట్లో ఉజ్జయని నగరం గుప్తుల సామ్రాజ్యానికి రాజధానిగా మాత్రమే కాకుండా విజ్ఞాన శాస్త్రాలు, కళలు మరియు సాంస్కృతిక అధ్యయనాలకు కేంద్రంగా ప్రసిద్ధిగాంచింది. శాస్త్రాలలో మిహిరుడి అభ్యాసం ఇక్కడే జరిగింది.

పిన్న వయస్సు లోనే మిహిరుడి ప్రతిభ రాజు విక్రమాదిత్య చంద్రగుప్తుడి గుర్తింపుకి వచ్చింది. దానితో అతడికి రాజుగారి ఆస్థానంలో ప్రవేశం లభించింది. త్వరలోనే మిహిరుడికి నవ రత్నాలలో (Nine Gems) ఒకడిగా ప్రఖ్యాతి వచ్చింది! మిహిరుడు తన జీవిత కాలంలో పర్షియ, గ్రీకు దేశం వంటి ఎన్నో దూర దేశాలను సందర్శించాడు. తన జ్ఞానం మరియు వాక్చాతుర్యంతో ఖగోళ శాస్త్ర సంబంధిత చర్చలను మరింత ఉత్తేజకరంగా మార్చేవాడట. వేద పరిజ్ఞానం కల వాడు; కానీ మూఢ నమ్మకాలు ఉండేవి కాదు. తనను ఒక శాస్త్రవేత్తగా పరిగణించేవాడు. భూమి గుండ్రంగా ఉంటుందనే ఆర్యభట్టుడి సూచనను మిహిరుడు సమర్ధించాడు. ఒక తెలియని "శక్తి" వస్తువులను భూమివైపు ఆకర్షించి అతికించి ఉంచుతుందని చరిత్రలో మొట్టమొదట అంచనా వేసింది మిహిరుడు. ఆ శక్తిని ఇవాళ మనం "గురుత్వాకర్షణ" (Gravity) అని పిలుస్తున్నాం. చంద్రుడు మరియు ఇతర గ్రహాలు కాంతివంతంగా ఉండడానికి కారణం సూర్య కిరణాల ప్రతిబింబం (Reflection) ద్వారా అని కూడా సూచించాడు. మిహిరుడు ఒక్క విషయం దగ్గర మాత్రం పొరపాటు పడ్డాడు: భూభ్రమణం (Rotation) సాధ్యం కాదని అతడు భావించాడు. "అదే నిజమైతే, తన గూటి నుంచి ఒక పక్షి భూమి భ్రమణ దిశకు వ్యతిరేకంగా (opposite direction) ఎగిరితే పైకి లేచిన వెంటనే గమ్యానికి చేరుతుంది". జీవావరణ (Ecology), జల ధర్మ (Hydrology) మరియు భూగర్భ (Geology) శాస్త్ర రంగాలలో కూడా మిహిరుడు కొన్ని ముఖ్యమైన పరిశీలనలు చేశాడు. కొన్ని రకాల చెట్లు మరియు చెద పురుగులు (Termites) భూగర్భ జలాల ఉనికిని తెలియపరుస్తాయన్న మిహిరుడి వాదనను నేటి శాస్త్రవేత్తలు ఇప్పుడిప్పుడే విశ్లేషిస్తున్నారు. గణిత శాస్త్రం త్రికోణమితి (Trigonometry)లో సైతం ముఖ్యమైన సూత్రాలను కనుగొన్నాడు. ఉదాహరణకి $\sin x = \cos(\pi/2 - x)$, $\sin^2 x + \cos^2 x = 1$ మరియు $(1 - \cos 2x)/2 = \sin^2 x$ వంటి సూత్రాల ఆవిష్కర్త మిహిరుడే!



Mural painting inside the Parliament House of New Delhi showing Varahamihira among other eminent Indian Scientists, Artist: Ms. Kumud Patel, Baroda.

మిహిరుడు సంస్కృత వ్యాకరణంలో దిట్ట; కవితా నైపుణ్యం కలిగినవాడు కూడా అయ్యి ఉండడంతో తన భావాలను విపులంగా వ్యక్త పరచగలిగేవాడు. ఫలవంతమైన (prolific) రచయిత. అతనికి విశ్వఖ్యాతిని తెచ్చిన గ్రంథాలు మూడు: పంచ సిద్ధాంతికం (Five Principles), బృహత్ సమ్హితం (Master Collection) మరియు బృహత్ జాతకం (Astrological Works). "పంచ సిద్ధాంతికం" ఖగోళ శాస్త్రానికి సంబంధించిన - సూర్య సిద్ధాంతం, రోమక సిద్ధాంతం, పౌలీస సిద్ధాంతం, వశిష్ట సిద్ధాంతం మరియు పైతామ సిద్ధాంతం అను ఐదు ప్రాచీన గ్రంథాల సారాంశం! ఈ వివరణలు ఆర్యభట్టుడి సిద్ధాంతాలతో సమానంగా హైందవ ఖగోళ శాస్త్రానికి పునాది మూలంగా పరిగణింపబడుచున్నాయి. "బృహత్ సమ్హితం" 106 అధ్యాయాల విజ్ఞానసర్వస్వం (Encyclopedia). ఇందులో మానవ ఆసక్తికి సంబంధించిన విషయాలు, గ్రహాల చలనం, గ్రహణాలు, మేఘాలు, వర్షపాత నమూనాల గూర్చే కాకుండా వివిధ ఆచారాలు, దేశీయ సమస్యలు వంటి వివరాలు ఎన్నో సేకరించబడి ఉన్నాయి. గరుడ పురాణంలోని రత్న విశ్లేషణ (Gemstone evaluation) ప్రమాణాలకు సంబంధించిన వివరాలు కూడా చేకూర్చబడినవి. "బృహత్ జాతకం" వైదిక జ్యోతిష శాస్త్ర రంగానికి ప్రధానమైన పాఠ్యపుస్తకంగా పరిగణిస్తారు. ఇందులో 407 శ్లోకాలు 28 అధ్యాయాలుగా వ్యవస్థీకరించబడినవి.

తన గ్రంథాల గురించి మిహిరుడు ఈ విధంగా పేర్కొన్నారు: "జ్యోతిష ఖగోళ శాస్త్రాలు అపారమైన సాగరాలు. వాటిని అధిగమించటం అందరివల్లా సాధ్యపడదు. నా సిద్ధాంతికలలోని జ్ఞానం ఆ సాగరాన్ని దాటేందుకు నావ వలే ఉపయోగపడుతుంది". ఇది ఆత్మస్తుతి కాదు. ఎందుకంటే 1500 సంవత్సరాల పిదప కూడా అవి కళాఖండాలుగా గుర్తించబడినవి.

443-420-7131

Science Cosmos

LICENSED AFTER SCHOOL CARE
STEAM PROGRAMS (6+ Years)

howard-east@sciencecosmos.com | | www.sciencecosmos.com/howard
www.facebook.com/howard.east.167
8480 Baltimore National Pike, #311 Normandy Shopping Center,
Ellicott City MD 21043

Paradise BIRYANI POINTE

**Paradise Biryani Pointe**
6400 Baltimore National Pike
Catonsville, MD 21228
**Phone**: 410-747-0080

**Job Guaranteed QA Training**

BvENJ Technologies

- ✓ $500 Only
- ✓ Job Guaranteed
- ✓ QA Training Manual
- ✓ Automation (QTP)
- ✓ Selenium
- ✓ Mobile Testing

**BvenJ Technologies**
Class Room Training in Owings Mills and Ellicott City
Phone: (703) 786-6886
http://www.bvenjtechnologies.com

https://www.facebook.com/cakewalaus/
9050 Baltimore National Pike, Ste 108, Ellicott City, MD 21043
(410) 418-4387 | | (410) 418-4548

Cake Wala

CAKES, PASTRIES, PUFFS.. and MORE..

Apsara day spa

ALL IN ONE BEAUTY NEEDS

(410) 744-4600
Info@ApsaraDaySpa.com
https://www.facebook.com/apsaradayspa/

**Phone**: (410) 531-8070

FREETOWN ANIMAL HOSPITAL

**Hickory Ridge Village Center**, 6470 **Freetown Rd** # 240, **Columbia**, **MD** 21044
www.freetownanimalhospital.com

TRISTAR REALTY, INC.

*Venkat Gurram*
*Realtor®*
*Cell: 765-702-4695*
*Office: 410-740-1050*
*Fax: 410-740-1051*
*Email: rvgurram@gmail.com*
*www.Mytristar.com*



OpenBox SOLUTIONS, INC.

2890 Carpenter Road, Suite# 2000
Ann Arbor, MI 48108
**Phone:** 734-975-1313
hr@OpenBoxSolutions.com
http://www.openboxsolutions.com

kw KELLERWILLIAMS. INTEGRITY
3290 North Ridge Rd, Ste. 150, Ellicott City, MD 21043

**Kiran Kumar**
REALTOR®

Office: 443-574-1600
Cell: 410-979-0856 • Fax: 443-574-1696
**Email:** kiran0506@yahoo.com
Each Office is Independently Owned and Operated



GODAVARI
*Truly South Indian*

**Godavari**
9011 Gaither Rd,Gaithersburg, MD 20877
**Phone**: 301-977-8600
**Email**: md@godavarius.com

Telligen Tech
Information Technology Services

- ✓ Data Warehousing
- ✓ Application Development
- ✓ Project Management
- ✓ Business Intelligence
- ✓ Identity and Access Management

**Telligen Tech**
2740 Airport Drive, Suite 190, Columbus OH 43219
Phone: (614) 934-1554 | Fax : (614) 934-1001
http://www.telligentech.com

AGISOL LLC
AGILE SOLUTIONS

8115 Maple Lawn Blvd Suite 350
Fulton, MD 20759
Phone: 301-775-2780
**Email**: Satyachalasani@agisol-llc.com

# TAM వంటిల్లు

## దహీ బైంగన్ (వంకాయ పెరుగు కూర)



- నూకల కొండల్



### కావలసిన పదార్థాలు:

పెరుగు - 500 మిల్లీ లీటర్లు
వంకాయలు - 1 కప్పు (సన్నగా, గుండ్రంగా తరగాలి)
ఎండు మిరపకాయలు - 2
ఆవ గింజలు - 3 టీ స్పూన్లు
కరివేపాకు - 10 నుండి 15 రెబ్బలు
అల్లం - కొద్దిగా (బాగా నలగాలి)
ఉప్పు - 3 టీ స్పూన్లు
పంచదార - 1 టీ స్పూను
నూనె - 2 కప్పులు
పసుపు - 1 టీ స్పూను
జీలకర్ర - 2 టీ స్పూన్లు



## తయారు చేయు విధానం

**మొదటి స్టెప్:**

మధ్యస్థం అయిన వేడి మీద నాన్-స్టిక్ పాన్ పెట్టండి. అందులో ఒక ఎండు మిరపకాయ మరియు జీలకర్ర వెయ్యండి.



ఒక రెండు నిముషాలు అలా మిరపకాయ, జీలకర్ర సువాసన వచ్చే వరకు వేగనివ్వండి.



ఈ విధంగా వేయించిన మిరపకాయ, జీలకర్ర మిక్సీలో వేసి పొడర్ లా చేయండి.

మిరపకాయ, జీలకర్ర పొడర్ని పెరుగు, ౨ టీ స్పూన్లు ఉప్పు, పంచదార, నలిగిన అల్లంతో పాటు కలిపి ఒక పక్క చిన్న పాత్రలో పెట్టండి.



**రెండవ స్టెప్:**

పసుపు మరియు 1 టీ స్పూను ఉప్పును వంకాయ ముక్కలతో కలపండి.

ఒక చిన్న బాండీలో నూనె వేసి మధ్యస్థమైన వేడిలో ఉంచండి. బాండీ వేడి ఎక్కాక అందులో వంకాయ ముక్కలను వేసి 2 నిముషాల పాటు లేదా వంకాయ ముక్కలు కొంచెం దోరగా వేగే వరకు ఉండనిచ్చి ఒక పక్కన ఉంచండి.



నాన్-స్టిక్ పాన్ మళ్ళీ మధ్యస్థమైన వేడిలో పెట్టి 1 టీ స్పూను నూనె వెయ్యండి. పాన్ వేడెక్కాక అందులో ఆవ గింజలు మరియు 1 ఎండు మిరపకాయ వెయ్యండి. ఆవ గింజలు చిటపట లాడగానే అందులో కరివేపాకు రెబ్బలు వేసి ఒక 30 సెకండ్ల పాటు వేగనివ్వండి.



పై విధంగా వేయించిన ఆవాలు, కరివేపాకు మరియు వంకాయ ముక్కలను ఇందాక చేసి ఉంచిన పెరుగులో కలపండి. బాగా కలిపి ఒక గంట పాటు వేచి ఉండండి. ఈ గంట సమయంలో వేగిన వంకాయ ముక్కలు పెరుగులోనూ, అందులో ఉన్న పదార్ధాలలో బాగా నానుతుంది. అప్పుడు మీరు ఈ కూరను వేడి అన్నంలో కలుపుకుని ఇంటిల్లిపాటీ ఆనందంగా ఆస్వాదించండి.





Call: 443 620 DECO
SS EVENT DECORS
Affordability | Sensational | Eye-Popping Décor
Balloon, Fabric & Flower Decorations for any Event
BIRTHDAY PARTIES
BABY SHOWERS
KIDS PARTIES
ANNIVERSARIES
WEDDINGS
BRIDAL SHOWERS
RECEPTIONS
COMMUNITY EVENTS
Contact us at : sseventdecors@gmail.com




BEST BRAINS
ABACUS ✧ MATH ✧ ENGLISH ✧ GK
Abacus
Maths
English
G.K
ROCKVILLE
301-744-0000
ELLICOTT CITY
410-698-1700
AS LOW AS $79 per month
GERMANTOWN
301-540-3330
OWINGS MILLS
410-324-3000
https://www.bestbrains.com




ISKCON of BALTIMORE
NEW KULINA GRAM DHAM
200 BLOOMSBURY AVE. CATONSVILLE, MD 21228
ISKCON BALTIMORE
ISKCON of BALTIMORE
NEW KULINA GRAM DHAM
200 BLOOMSBURY AVE. CATONSVILLE, MD 21228
ISKCON BALTIMORE




PerigonSoft
✓ IT Staffing
✓ Software Development
✓ Application Maintenance
✓ QA Testing
✓ Software Re-Engineering
✓ IT Training
PerigonSoft
10440 Little Patuxent Parkway, Suite 500, Columbia, MD 21044, USA
Phone: 410-864-8488 | Fax: 866-708-1242
Email: info@perigonsoft.com




TRIGINT SOLUTIONS
✓ IT Consulting
✓ Business Process Mgmt.
✓ IT Training
✓ Quality Assurance
TRIGINT Solutions
22D Montgomery Village Ave, Gaithersburg, MD 20879
Office: (240) 654-5757 | Fax: (410) 649-5261
Email : info@trigintsolutions.com
www.trigintsolutions.com





Phone: (301) 474-9600
BUSINESSINTEGRA
TOGETHER » IT IS DONE
6550 Rock Spring Dr #600,
Bethesda, MD 20817
www.businessintegra.com

# TAM Patrika CROSSWORD

Please send your answers to tampatrika@tamaryland.org with-in 30 days after the release date of TAM Patrika.

- Answers received after 30-days of TAM Patrika release will not be considered.
- Participants must be of Telugu origin residing in Maryland, USA.
- Please encourage your kids to work on this.
- First 3 winners will be given a 10-dollar gift card each.
- Answers, Winners names, and names of all people who have correctly answered will be announced in the next edition of TAM Patrika.
- Who ever sends the correct answers earlier to the above mentioned email address will be considered as winners.
- If no one answers all the questions correctly, winners will be decided based on most number of correct answers.
- TAM Patrika reserves the right to select the winners.
- Any questions related to this can be sent to **tampatrika@tamaryland.org.**

**TAM Patrika CROSSWORD - April, 2018**




**ACROSS:**

1. Dignified (6)
2. Yello part of egg (4)
4. A period of history (3)
7. Solely (4)
9. Large Meal (5)
10. Experienced (7)
12. With-in (5)

**DOWN:**

1. Exactly Same (7)
3. Very Important (3)
5. Collection of Weapons (7)
6. Danger (6)
8. Active (6)
9. Recent (5)
11. Respond (5)

# Our Proud Sponsors

PACE
COMPUTER SOLUTIONS

- ✓ Oracle Applications Consulting
- ✓ SOA/BPM/Integration
- ✓ Enterprise Portal
- ✓ Information Management
- ✓ PeopleSoft Upgrade
- ✓ Health IT

**PACE Computer Solutions, Inc**

10500 Little Patuxent Pkwy, Suite # 310, Columbia, MD 21044
**Phone**: (443) 539-0290
**Fax** : (443) 539-0292
**Email**: info.us@pace-solutionsinc.com

SOFTRAMS

**SOFTRAMS, LLC**
www.softrams.com

- ➢ Portals
- ➢ Data Analytics
- ➢ Big Data Intake & Mining
- ➢ Analytics & App Development
- ➢ SOA & Systems Integration
- ➢ BPM

161 Fort Evans Road NE, Suite # 205, **Leesburg, VA** 20176
Phone : 571.918.8977 | Fax : 703.879.7589 | Email : info@softrams.com

2520 Lord Baltimore Dr. Suite #H, **Windsor Mill, MD** 21244
Phone : 571.918.8977 | Fax : 703.879.7589 | Email : info@softrams.com

POLAR

- ✓ Strategic Solutions
- ✓ Digital Technologies
- ✓ Business Intelligence
- ✓ Quality Assurance
- ✓ Staff Augmentation
- ✓ BPO Services

**POLAR IT**

6095 Marshalee Drive, Suite 250
Elkridge, MD 21075
Tel: (410)-981-9981
Fax: (410)-540-9909
E-mail: contactus@polarits.com

Estate Home Realty

estatehome.realty@gmail.com
240-200-4009

PMP Easy.com

46838 Willowood Pl, Sterling, VA 20165
**Phone:** (571) 488-1520
**Email:** MyPMP@PMPEASY.com
http://www.pmpeasy.com

Streams Inc

❖ Consulting
❖ Recruitment
❖ Placement

100 West Road, Suite 300
Towson MD 21204
(410)929-7087 (Main)
(410)988-3207 (Fax)

Children's Manor
MONTESSORI SCHOOL

4465 Montgomery Rd, Ellicott City, MD 21043
**Phone:** (410) 461-6070
**Email:** ellicottcity@childrensmanor.com
http://www.childrensmanor.com/ellicottcity/

ENTMatrix, Inc.

3448 Ellicott Centre Dr., Suite # 204,
Ellicott City, MD 21043
**Phone:** (410) 881-0455
**Email:** hr@entmatrix.com
http://www.entmatrix.com

**Soma Barman,** Realtor
9251 Baltimore National Pike, Suite D
Ellicott City, MD 21042
Phone: 410-465-6900
Fax: 410-465-6922



THE BOB LUCIDO TEAM
of Keller Williams Integrity
INTEGRITY. KNOWLEDGE. RESULTS.

MATHNASIUM®
The Math Learning Center

3290 Pine Orchard Ln, Ellicott City, MD 21042
**Phone:** 443-863-MATH (6284)
**Email:** ellicottcity@mathnasium.com
http://www.mathnasium.com/ellicottcity

# EXECUTIVE COMMITTEE - CHAIRS



Rajasekhar Cherukuri
TAM Patrika



Archana Kathi
Cultural



Bhagath Yarlagadda
Food Committee



Sombabu Mullapudi
Membership



Srini Dama
TAM Creative IT



Sainath Bandari
Event Management



Kishore Korrapati
Sports



Kiran Talluri
Election



Swathi Ranga
Social Media



Anitha Muthoju
Womens Forum



Madhavi Kaipa
Financial Audit



Shyamala Tirunagari
Hospitality



Sujatha Srinivas
Decoration



Srinivas Potu
Spiritual



Apparao Pathuri
Telugu Literature



Smitha Bodepudi
Kids Activities



Vamshi Gandham
Photography



Harish Kukatla
By-laws



Harsha Peramaneni
Volunteer Services



Srinadh Kandru
Facility Services



Kondal Nookala
Community Services



Vamshi Ingu
Transportation



Vijay Aluru
Awards Committee



Haritha Chintapally
Womens Sports

# EXECUTIVE COMMITTEE
## Co-Chairs


Ravi Kopparapu
TAM Patrika


Srini Pigilam
Cultural


Bharath Reddy Vatti
Food Committee


Kiran Kumar Chandra
Event Management


Mrudula Mallina
Womens Sports


Ramarao Tulluri
Sports


Hari Kothurthi
Election


Srujana Nadella
Decoration



Ram Sista
Volunteer Services


Srini Tirumalasetti
Finance Audit


Ravi Dasari
Community Services


Bindu Tadivaka
Social Media


Rajasekhar Gudla
Social Media


Baby Reddy Seelam
Hospitality


Shafi Syed
Awards Committee


Shanti Kuppili
Photography

# రచనలకు ఆహ్వానము

TAM పత్రిక గత సంచిక మీరు చదివి ఆనందించారు అని ఆశిస్తున్నాము.
(http://www.tamaryland.org/tam-patrika-details.html).

TAM పత్రిక ప్రతి మూడు నెలలకు ఒకసారి వెలువడుతుంది. ఔత్సాహిక రచయితలు, రచయిత్రులు మీ కలం కదిపి మీ ఆలోచనలు పంచుకోవడానికి TAM పత్రికను వేదిక చేసుకుంటారని మేము ఆశిస్తున్నాము.

మీకు వ్రాసే అలవాటు వున్నా..వ్రాయాలని మనసులో కోరిక వున్నా..TAM పత్రిక మిమ్ము వెన్నంటి ప్రోత్సహిస్తుంది. కింద పేర్కొన్న నియమాలు పాటిస్తూ, మీ ఆలోచనలు మాకు ఈ మెయిల్ ద్వారా tampatrika@tamaryland.org కు పంపించండి....తెలుగు భాష ఉన్నతికి తోడ్పడండి.

1) అమెరికాలో తెలుగు ప్రజల రోజు వారీ జీవితంలో ప్రతిబింబించే సమస్యలను స్పృశిస్తూ, వాటికి మీకు తోచిన పరిష్కారాలు సూచిస్తూ ఉండేవీ, చక్కటి తెలుగు హాస్యంతో కూడినవి, తెలుగు మహనీయుల జీవిత చరిత్రల గురించినవి, తెలుగు భాష ఉన్నతిని కోరుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రోత్సాహం అందించేలా ఉండే వాటికి ప్రాధాన్యత ఇవ్వబడును.

2) మీరు వ్రాసే విషయాలు ఎవరికీ ఇబ్బంది కలిగించకూడదు. అందరి మనోభావాలను గౌరవించేలా వుండాలి. ఏ కులాలను, మతాలను కించపరిచేలా ఉండకూడదు.

3) మీరు మాకు పంపే ఆర్టికల్స్ మీ సొంతం అని హామీ పత్రం జతపరచాలి. ఇతరుల నుంచి స్ఫూర్తి పొంది వ్రాసే వాటికి references ఇవ్వాలి.

4) మీరు వ్రాసేవి తెలుగులో ఉంటే మంచిది. తెలుగు టైపింగ్ కొరకు www.lekhini.org లేదా మరే ఇతర online టైప్ రైటర్ సదుపాయం ఉపయోగించుకోండి. చేతి వ్రాతతో పంపే వారు చక్కటి దస్తూరితో వ్రాసి స్కాన్ చేసి పంపగలరని మనవి.

5) TAM పత్రిక ప్రతి మూడు నెలలకు ఒకసారి మొదటి తారీఖున వెలువడుతుంది. మీ అమూల్యమయిన ఆర్టికల్స్/కథలు/కవితలు మాకు 15 రోజుల ముందుగా అందేట్లు చూడండి.

6) మీ ఆర్టికల్స్ ప్రచురణకు స్వీకరించబడితే మీకు ఈ మెయిల్ ద్వారా తెలియజేయబడుతుంది.

7) ప్రచురణ తుది నిర్ణయం సంపాదకులదే. ఏ కారణం చేతనయినా మీరు పంపిన ఆర్టికల్స్/కథలు/కవితలు మీరు కోరుకున్న సంచికలో మేము ప్రచురించలేకపోయిన ఎడల, తదుపరి సంచికలో ప్రచురించే ప్రయత్నం చేస్తాము.

ఈ మెయిల్: tampatrika@tamaryland.org
TAM పత్రిక వెలువడు నెలలు (January, April, July, October)

**తెలుగు అసోసియేషన్ ఆఫ్ మేరీలాండ్**